

లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా

- రోడ్డు పక్కనున్న మేకల కాపరిపై పడడంతో అక్కడికక్కడే మృతి
- ట్రాక్టర్‌లో ఉన్న ముగ్గురికి గాయాలు

ఆర్టీసీ బస్సు ఢీకొని చిరువ్యాపారి మృతి



... వార్తలు 8వ పేజీలో

విద్యుద్దీప కాంతుల్లో సింహాచల దేవస్థానం



సింహగిరికి ఉత్సవ శోభ

నేడే చందనోత్సవం

భక్తులకు నిజరూపంలో దర్శనమివ్వనున్న అప్పన్న

- తెల్లవారుజామున 4 గంటల నుంచి అవకాశం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- విద్యుద్దీపాలతో దేవస్థానం, రాజగోపురం, పరిసర ప్రాంతాల అలంకరణ



సింహాచలం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):

ఏడాది పొడవునా చందనపు పైపూతతో పూజలందుకునే సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి బుధవారం ద్వయావతారుడిగా తన నిజరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అపురూపమైన స్వామి నిజరూప దర్శనం (చందనోత్సవం) కోసం లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. అందుకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చందనోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి గంటకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలుపుతారు. 1.30 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము, తదితరాలు నిర్వహిస్తారు. ఆ తరువాత ఏడాది పొడవునా స్వామి వారిపై పూతగా ఉండే చందనాన్ని తొలగించి, ప్రభాత ఆరాధన చేస్తారు. బుధవారం తెల్లవారుజామున 3.00 గంటలకు ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పిస్తారు. 3.30 గంటల నుంచి 4 గంటల నడుమ ప్రభుత్వం, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున సంప్రదాయ వస్త్ర సమర్పణలు ఉంటాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. స్వామి దర్శనం కోసం అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల నుంచి భక్తులు వందలాది మంది మంగళవారం సాయంత్రానికి సింహగిరికి చేరుకున్నారు. దేవస్థానం ఏర్పాటుచేసిన ఉచిత దర్శనం క్యూలో వేచిఉన్నారు.

ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం అధికారులు రంగురంగుల విద్యుత్ దీపాలతో సింహగిరిని శోభాయమానంగా అలంకరించారు. అదేవిధంగా క్యూలను ... మిగతా 8వ పేజీలో



అప్పన్న నిజరూప దర్శనం కోసం మంగళవారం రాత్రే క్యూ లైన్లలో వేచిఉన్న భక్తులు

ఇసుకాసురుల బరితెగింపు



లక్కవరం వద్ద శారదా నది గట్టు ధ్వంసం



లక్కవరం వద్ద ఇసుక కోసం 15 అడుగుల మేర తవ్వేసిన శారదా నది గట్టు

- ఎక్స్‌కవేటర్లతో 15 అడుగుల మేర తవ్వకాలు
- ట్రాక్టర్లతో విశాఖకు తరలింపు
- నదికి వరదలు వస్తే.. గట్లకు గండ్లు పడే ప్రమాదం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు



ఇసుక కోసం కూల్చివేసిన తాటి చెట్లు

చోడవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):

ఇసుకాసురులు బరితెగించారు. చోడవరం, కె.కోటపాడు మండలాల సరిహద్దులో శారదా నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. సాధారణంగా నది గర్భంలో ఇసుక తవ్వుకుంటారు. కానీ ఇక్కడ నది గట్టును ఆనుకుని పది నుంచి పదిహేను అడుగుల లోతు మేర ఇసుక తవ్వుతున్నారు. ఇళ్ల నిర్మాణాలు, ఇతర పనుల కోసం సమీపంలో వున్న నదులు, గెడ్డల్లో నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చుని ప్రభుత్వం కల్పించిన వెసులు బాటును కొంతమంది నాయకులు తమకు అనుకూలంగా మార్చుకుని ఇసుక వ్యాపారం చేస్తున్నారు. విశాఖకు చెందిన ఓ వ్యక్తి.. చోడవరం మండలం లక్కవరం, కె.కోటపాడు మండలం చౌడువాడ పంచాయతీ శివారు మల్లంపాలెం, కొల్లువీధి పరిసరాల్లో యంత్రాలతో శారదా నది గట్లను ధ్వంసం చేసి, చెట్లను కూల్చివేసి ఇసుక తవ్వకాలు కొనసాగిస్తున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ట్రాక్టర్లతో విశాఖ నగర శివారు ప్రాంతాలకు తరలిస్తున్నారు. సుమారు నెల రోజుల నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపు జరుగుతుంటే రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదు. ఇటీవల స్థానికులు స్పందించి, ఇసుక రవాణా చేసేందుకు వచ్చిన 16 ట్రాక్టర్లను పట్టుకుని రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. వాటిల్లో ఇసు క లేదంటూ రెవెన్యూ సిబ్బంది వదిలేశారు. ఇసుక కోసం శారదా నది గట్లను ధ్వంసం చేయడం వల్ల వర్షా కాలంలో వరదలు వస్తే గట్లకు గండ్లుపడి, పొలాలను ముంచెత్తే ప్రమాదం వుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ట్రాక్టర్లతో తరలిస్తున్న ఇసుక

వీడిన హత్య కేసు మిస్టరీ

మృతుడు ఎలమంచిలి వాసిగా గుర్తింపు

- రెండు నెలల క్రితం భార్య, ప్రియుడు, మరో వ్యక్తి కలిసి హత్య
- కాకికాడ జిల్లా చేబ్రోలు వద్ద మృతదేహం పడవేత
- మృతుడి తల్లి ఫిర్యాదుతో వీడిన మిస్టరీ
- నిందితులను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు



తంగెళ్ల లోవరాజు (ఫైల్ ఫొటో)

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):

కాకినాడ జిల్లాలో సంచలనం కలిగించిన గుర్తు తెలియని వ్యక్తి మృతి కేసులో మిస్టరీ వీడింది. రెండు నెలల క్రితం హత్యకు గురైన ఇతను అనకాపల్లి జిల్లా ఎలమంచిలి పట్టణానికి చెందిన తంగెళ్ల లోవరాజు (37)గా గుర్తించారు. భార్య, ఆమె ప్రియుడు, మరోవ్యక్తి కలిసి ఎలమంచిలిలో ఇంటి వద్ద హత్య చేసి, మృతదేహాన్ని కాకినాడ జిల్లా చేబ్రోలు బైపాస్ రోడ్డులో పడవేసినట్టు పోలీసు విచారణలో తేలింది. ఈ కేసును తదుపరి దర్యాప్తు నిమిత్తం ఎలమంచిలి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయనున్నట్టు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్ రోడ్డులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇంటి సమీపంలో మార్చి మూడో తేదీన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహంపై ఉన్న గాయాలు, పడి ఉన్న తీరును పరిశీలించిన పోలీసులు... ఇది హత్యాగా నిర్ధారించారు. ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ స్వయంగా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, సెల్‌టవర్ సిగ్నల్స్ ఆధారంగా సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ, పోలీసులతో కూడిన బృందం చేసిన విచారణలో ఎర్ర రంగు కారు, ఇతర ఆధారాలు లభ్యమైనప్పటికీ వాటి ఆధారంగా కేసు ముందుకు వెళ్లలేదు. ఈ నేపథ్యంలో తన కుమారుడు తంగెళ్ల లోవరాజు రెండు నెలల నుంచి కనిపించడం లేదంటూ అనకాపల్లి జిల్లా ఎలమంచిలి పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఓ మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసు శాఖ వెబ్‌సైట్‌లో నమోదైన ఈ కేసు వివరాలను పరిశీలించిన గొల్లప్రోలు పోలీసులు ... మిగతా 8వ పేజీలో

నేడే పాలీసెట్

అనకాపల్లి, నర్సీపట్నంలో 23 కేంద్రాలు

- 9,022 మంది అభ్యర్థులు
- ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు పరీక్ష

అనకాపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం బుధవారం నిర్వహించే పాలీసెట్-2025కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని అనకాపల్లి పట్టణంలో 14 కేంద్రాలు, నర్సీపట్నంలో 9 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. అనకాపల్లి కేంద్రాల్లో 6,574 మంది, నర్సీపట్నం కేంద్రాల్లో 2,338 మంది.. మొత్తం 9,022 మంది పరీక్షలు రాయనున్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుంది. తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్లతో గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. బాల్‌పాయింట్ (బ్లాక్) పెన్ను, హెచ్‌బీ/2బీ పెన్సిల్, ఎరైజర్, షార్ప్‌నర్ మాత్రమే వెంట తీసుకెళ్లాలి. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను (ట్యాబ్‌లు, మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, స్మార్టు వాచ్‌లు వంటివి) అనుమతించరు.

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న వారికి మాత్రమే!

పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ బుక్స్ కూడా..

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

పాఠశాలల విద్యార్థులకే కాకుండా జూనియర్ కళాశాలల విద్యార్థులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నది. కళాశాలలు పునఃప్రారంభం కావడానికి ఇంకా నెల రోజులకుపైగా సమయం వున్నప్పటికీ ఏప్రిల్‌లోనే పుస్తకాలను పంపిణీ చేయాలని విద్యా శాఖ అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌పుస్తకాలను కూడా అందజేస్తున్నారు.



అనకాపల్లిలో ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న అధికారులు

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందజేసింది. అదే విధంగా మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా అమలు చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రెండు ఉచితాలకు మంగళం పాడింది. దీంతో విద్యార్థులు సొంత సొమ్ముతో పాఠ్యపుస్తకాలను కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. గత ఏడాది ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయి, కూటమి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయాలని నిర్ణయించింది. కూటమి అధికారంలోకి వచ్చేనాటికే కళాశాలలు ప్రారంభం కావడం, పాఠ్యపుస్తకాలను ముద్రించి పంపిణీ చేయడానికి తగిన సమయం లేకపోవడంతో ఈ ఏడాది నుంచి పాఠ్యపుస్తకాలు అందజేయనున్నట్టు ప్రకటించింది. మధ్యాహ్న భోజన పథకాన్ని ఈ ఏడాది జనవరిలోనే ప్రారంభించారు. ఇప్పుడు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. తొలుత ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సెకండియర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. తరువాత ఇతర ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని విద్యాసంస్థల్లో చదువుతున్న బాలబాలికలకు అందజేస్తారు. కాగా ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు అందజేయడానికి 1,24,884 నోటు పుస్తకాలు జిల్లాకు చేరాయి. ఒక్కో విద్యార్థికి 12 నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తారు. ప్రస్తుతం సెకండియర్ విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్నారు. ఫస్టియర్ అడ్మిషన్లు పూర్తయిన తరువాత ఆ విద్యార్థులకు కూడా నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తారు.

ఆధార్ అప్‌డేట్‌కు పాట్లు

గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి

- రోజుకు 25-30 మందికి మాత్రమే నమోదు
- కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు



పోస్టాఫీసు తెరవకముందే ఆధార్ అప్‌డేట్ కోసం బారులు తీరిన రేషన్ కార్డుదారులు

ఎలమంచిలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):

రేషన్ కార్డుదారులు ఆధార్ అప్‌డేట్ కోసం నమోదు కేంద్రాల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తున్నది. కేంద్రాలను ఉదయం పది గంటలకు తెరుస్తుండగా... ఆరు గంటలకే చిన్నపిల్లలతోసహా ఆయా కేంద్రాల వద్దకు వచ్చి బారులు తీరుతున్నారు. వేసవి కావడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు గంటల తరబడి క్యూలో నిల్చోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలమంచిలిలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఆరు వున్నాయి. పట్టణంతోపాటు మండలంలోని అన్ని పంచాయతీల రేషన్‌కార్డుదారులు ఇక్కడే ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి. దీంతో ఆధార్ నమోదు కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. మిగిలిన ... మిగతా 8వ పేజీలో



ఆధార్ నమోదు కేంద్రం వద్ద తోపులాట

తాడి నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో చోరీ

ఆరు కిలోల వెండి ఆభరణాలు అపహరణ

- హుండీని పగలగొట్టి కానుకల నగదు సైతం..



చోరులు విరగ్గొట్టిన గర్భగుడి తలుపులు

పరవాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని తాడి గ్రామంలో వున్న ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన ద్వారం తలుపులు పగలగొట్టి ఆరు కిలోల వెండి ఆభరణాలతో పాటు హుండీలో కానుకల సొమ్ము అపహరించుకుపోయారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఆలయ ప్రధాన అర్చకుడు రామారావు రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లారు. ఆలయ మండపం ప్రధాన గేటుతోపాటు గర్భగుడికి ముందున్న ఇనుపగేటు, తర్వాత ఉన్న ప్రధానద్వారం తలుపులు పగులగొట్టి ఉండడాన్ని గమనించారు. గర్భగుడిలోకి వెళ్లి చూడగా స్వామివారికి అలంకరించిన మూడు కిలోల వెండి నాగాభరణం, మూడు కిలోల ... మిగతా 8వ పేజీలో



పగలగొట్టిన హుండీ

ప్రత్యేక తరగతుల పేరుతో చర్చిలో మత బోధనలు

- 8లో

- ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంపై పోలీసులకు ఫిర్యాదు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన సుందరపు



ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియోజకవర్గంలో గల ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అచ్యుతాపురంలో వైద్య సదుపాయాలు మెరుగు పరచాలని, సిబ్బంది, మందులు కొరత లేకుండా చూడాలని కోరారు. దీనికి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారని విజయకుమార్ తెలిపారు.

'దళితుల కరెంటు బిల్లులు రద్దు చేయాలి'



డొంకాడలో దళితులతో ఆందోళన చేస్తున్న సీపీఎం నేత అప్పలరాజు

నక్కపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకాడ గ్రామంలో దళితులకు ఇచ్చిన విద్యుత్ బిల్లులను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ గ్రామానికి చెందిన దళితులకు విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ బిల్లులు ఇచ్చి, మే 3 నాటికి చెల్లించాలని, లేకపోతే ఫీజులు తీసేస్తామని భయపెడుతున్నారని చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఈ కాలనీకి సీపీఎం నేతలు అప్పలరాజు, రాజేశ్ వెళ్లి వారికి సంఘీభావం ప్రకటించారు. కూటమి అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకూ దళితులకు మినహాయింపు వుంటుందని చెప్పారన్నారు. ఏ ఆధారం లేని దళితులను విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో యు.ఆనందరావు, ఈ .సత్యనారాయణ, నూకేశ్, అప్పారావు, సత్యవతి, కుమారి, అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి చేరుకున్న శ్రీరామ రక్ష రథయాత్ర



ఎలమంచిలికి చేరుకున్న శ్రీరామ రక్ష రథయాత్ర

ఎలమంచిలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ రథయాత్ర మంగళవారం మండలానికి చేరుకుంది. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రథయాత్రకు మండలంలో కట్టుపాలెం, తురంగలపాలెం, జంపపాలెం, రామారాయుడుపాలెం గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. రథంలో ఉన్న బాలరాముని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు పలు ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సోలార్ నగరంగా అమరావతి : ప్రగడ



ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.65 వేల కోట్లతో 8,352 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దుకోబోతుందన్నారు. ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందన్నారు. అమరావతి నగర విద్యుత్ అవసరాల నిమిత్తం 2,700 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని వినియోగించుకునేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రజల మనస్సుల్లో నిలిచిపోతుందని కొనియాడారు.

లింగాపురంలో గుర్రం పందెల పోటీలు

కోటవురట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురంలో మంగళవారం గుర్రం పరుగు పందెం పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. లింగాపురంలో పోలేరమ్మ జాతర సందర్భంగా విశాఖపట్నం అనకాపల్లి, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాలనుంచి 12 గుర్రాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.12వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.8వేలు, నాలుగో బహుమతి రూ. 6వేలు, 5వ బహుమతికి రూ.4వేలు అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

గెడ్డ ఆక్రమణపై అధికారుల విచారణ

కోటవురట్ల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకపూర్‌గ్రామంలో గెడ్డ ఆక్రమణపై రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాసరావు తన గ్రామంలో గెడ్డ ఆక్రమణపై విచారణ నిర్వహించాలని జిల్లాకలెక్టర్‌కు సోమవారం నర్సీపట్నంలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి ఒకరు గెడ్డ ఆక్రమించి జీడి పిక్కల ఫ్యాక్టరీ, భవనాలు నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ విషయమై తహసీల్దార్ తిరుమలబాబును వివరణ కోరగా.. సిబ్బంది పూర్తిస్థాయిలో సర్వే చేయలేదన్నారు. మరో రోజు సర్వే చేయిస్తామన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం



ఎస్. రాయవరంలో దగ్ధమవుతున్న వరి గడ్డి ట్రాక్టర్

ఎస్.రాయవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం వరి గడ్డి లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలి దగ్ధమైంది. సైతారుపేట నుంచి కోటవురట్ల మండలం గొట్టివాడకు వెళుతున్న వరిగడ్డి ట్రాక్టర్‌కు ఎస్. రాయవరం వద్ద విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. దీనిని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై ట్రాక్టర్‌ను ఎవరూ లేని ప్రదేశానికి తరలించారు. మంటలను అదుపు చేయడానికి అవకాశం లేకపోవడంతో ట్రాక్టర్‌పై ఉన్న గడ్డి మొత్తం కాలిపోయిందని స్థానికులు తెలిపారు.

బోర్లు నిర్వహణపై వీడని నిర్లక్ష్యం

- వేసవి వచ్చినా కానరాని ముందస్తు చర్యలు
- పత్రికల్లో వచ్చిన బోర్లుకు మాత్రమే మరమ్మతులు
- మిగిలిన వాటి జోలికి వెళ్లని అధికారులు



లైనుకొత్తూరు సమీపంలోని బీరకాయలపాలెంలో మూలకు చేరిన చేతిబోరు

ఎలమంచిలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అన్ని వేళలా తాగునీటిని అందించే చేతి బోర్ల నిర్వహణపై అటు మునిసిపల్, ఇటు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వేసవి కాలం రాకముందే బోర్లు పనితీరును పరిశీలించి, వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. వేసవిలో ప్రజలు తాగునీటిని ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని మునిసిపల్, మండల అధికారులకు జిల్లా అధికారులు జారీ చేసిన ఆదేశాలు ఎలమంచిలిలో బుట్టదాఖలయ్యాయి. వేసవి వచ్చి రెండు నెలలు అయినా బోర్లు నిర్వహణ అధ్వానంగా ఉంది. అయినా జిల్లా అధికారులు కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. పత్రికల్లో బోర్లు పనిచేయడం లేదని వార్తలు, ఫొటోలు వస్తే.. వాటికి మాత్రమే అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. మునిసిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు మాత్రం తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పాలకులు సైతం అధికారుల పనితీరును పట్టించుకోవడం లేదు. మునిసిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో మూలకు చేరిన బోర్లు అనేకం ఉన్నా.. వాటిని పునరుద్ధరించేందుకు తీసుకున్న చర్యలు కానరాలేదు. వేసవిలో ఎలమంచిలి మునిసిపల్ ప్రజలకు తాగునీటి కష్టాలు ఏటా తప్పడం లేదు. పట్టణంలోని రామారాయుడుపాలెం వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన, లైనుకొత్తూరు సమీపంలోని బీరకాయలపాలెం ప్రధాన రోడ్డు పక్కన, పులపర్తి గ్రామంలో సచివాలయం ఎదురుగా, ములకలాపల్లి సిమెంటు పరిశ్రమ సమీపంలో ఇలా ప్రతి గ్రామంలోనూ మూలకు చేరిన బోర్లు అనేకం ఉన్నాయి. ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉన్నతాధికారులు స్పందించి బోర్లు మరమ్మతులపై సత్వర చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగాల పేరిట జనసేన నేత మోసం

- జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల శివ ఆరోపణ



అడ్డరోడ్డులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పప్పల శివ

ఎస్.రాయవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడు గ్రామానికి చెందిన జనసేన నేత లింగంపల్లి జ్యోతికుమార్ పార్టీ పేరు, కొంత మంది రాజకీయ నాయకుల పేర్లు చెప్పి ఉద్యోగాలు, స్థలాలు ఇప్పిస్తానని లక్షల్లో వసూలు చేసి పలువురిని మోసం చేశాడని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల శివ ఆరోపించారు. మంగళవారం అడ్డరోడ్డులో బాధితులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ జనసేన పార్టీకి చెడ్డపేరు తీసుకువచ్చిన జ్యోతికుమార్ మోసాల విషయాన్ని హోం మంత్రి అనిత, జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. హోం మంత్రి అనిత స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని శివ కోరారు. ఈ విషయమై పలువురు బాధితులు ఎస్.రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.

టీడీపీ పూడిమడక అధ్యక్షుడిగా వెంకటరావు



పూడిమడకలో ఎంపికైన కమిటీ సభ్యులతో టీడీపీ నాయకులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడకలో మంగళవారం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా మేరుగు వెంకటరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యదర్శిగా తెడ్డు వీరమ్మ, ప్రధానకార్యదర్శిగా మైలపల్లి మసేనురావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అంగ వరలక్ష్మి, చోడిపల్లి అప్పారావు, సమ్మింగి బుజ్జి, కార్యదర్శులుగా ఎరిపల్లి సోలయ్య, దేముడు, గంగిరి నూకాలు, కోశాధికారిగా మైలపల్లి ధనరాజ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. తెలుగు యువత గ్రామ అధ్యక్షుడిగా యజ్జల రమణ, ఉపాధ్యక్షుడిగా మద్దు వీర్రాజు, ప్రధాన కార్యదర్శిగా ధోని కిరణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వాడమదుల చిన్న, మల్లి ధనరాజ్, కార్యదర్శులుగా మైలపల్లి మసేను, దూడ జగన్, మైలపల్లి మారయ్య, కోశాధికారిగా వసంతరావు ఏకగ్రీంగా ఎంపికయ్యారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా డి. ధోని, ఉపాధ్యక్షుడిగా ధోని కాసుబాబు, ప్రధాన కార్యదర్శిగా కొవిరి గంగయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మేరుగు దానయ్య, పుక్కల్ల నూకరాజు, చెల్లూరి జగ్గారావు, కార్యదర్శులుగా ధోని కాసుబాబు, ఎజ్జల అచ్చయ్య, కోశాధికారిగా చేపల దేముడు ఎంపికయ్యారు. అలాగే తెలుగు మహిళ అధ్యక్షురాలిగా కొవిరి ఎర్రమ్మ, ఉపాధ్యక్షురాలిగా మేరుగు శేష, ప్రధాన కార్యదర్శిగా దూడ మమ్మలు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ధోని రాజమ్మ, కార్యదర్శిగా చేపల నూక రత్నం, కోశాధికారిగా చిట్టూరి చిన్నారమ్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికలు తెలుగుదేశం సీనియర్ నాయకుడు మేరుగు బాపు నాయుడు ఆధ్వర్యంలో జరిగాయి.

టీడీపీ పలు గ్రామ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం



కుమారపురం టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికైన చవ్వాకుల వరహాలరావుని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీల ఎన్నికలు సోమవారం రాత్రి పలు గ్రామాల్లో పార్టీ నేతలు నిర్వహించారు. మండలంలోని కుమారపురం, ఎస్.నర్సాపురం, కందిపూడి గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. టీడీపీ కుమారపురం గ్రామ అధ్యక్షుడిగా చవ్వాకుల వరహాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భగంగా సోమవారం రాత్రి కుమారపురంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు చవ్వాకుల వరహాలరావు, ఉపాధ్యక్షుడిగా నీలాపు త్రిమూర్తులురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కమిటీని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు నీలాపు మహేష్‌రెడ్డి, బొంది కాశీవిశ్వనాథం, కుప్పిలి సురేష్‌రెడ్డి, రావాడ గోవిందరెడ్డి, నీలాపు బాలానందరెడ్డి సత్కరించారు. అలాగే ఎస్.నర్సాపురం గ్రామ అధ్యక్షుడిగా పల్లెల సత్తిబాబు, కందిపూడి గ్రామ అధ్యక్షుడిగా నక్క రాంబాబురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, చింతకాయల రాంబాబు, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాలో శిక్షణ



విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు యోగా, స్పోకెన్ ఇంగ్లీషుపై శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా ఇంగ్లీషు గ్రామర్, జనరల్ నాలెడ్జ్, పుస్తక పఠనం, నీతి కథలు, భగవద్గీతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఆసక్తి ఉన్న పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్స్ ఎస్.సీతారామయ్య, ఏపూరి శ్రీనివాసరావు, తాళరావు, ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలకు విశేష స్పందన

నక్కపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్రలేఖనంతో పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని గ్రంథాలయాధికారి జనార్దన్ చెప్పారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

టీడీపీ తోటాడ గ్రామ అధ్యక్షుడిగా మురళీకృష్ణ



తోటాడలో తెలుగుదేశం పార్టీ గ్రామకమిటీ సభ్యులు

మునగపాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తోటాడ గ్రామ అధ్యక్షుడుగా పొలమరశెట్టి మురళీకృష్ణ ఎన్నికయ్యారు. మండలంలో తోటాడ శివారు గవర్ల అనకాపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన టీడీపీ సమావేశంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆళ్ల సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా అనకాపల్లి తులసిరావు, సహాయ కార్యదర్శిగా పొలమరశెట్టి బాగేశ్వరరావుతోపాటు పలువురు సభ్యులుగా ఎన్నికున్నారని మురళీకృష్ణ తెలిపారు. గ్రామంలో టీడీపీ బలోపేతం లక్ష్యంగా పనిచేస్తామని కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, దొడ్డి రమేష్, చదరం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జడ్.చింతువా గ్రామ అధ్యక్షుడిగా అమ్మోరు

రాంబిల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జడ్.చింతువా గ్రామ అధ్యక్షుడిగా చెల్లూరి అమ్మోరు (ఆనంద్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం లోవపాలెంలో జరిగిన ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా వాడ్ర వెంకటరావు,జనరల్ సెక్రటరీగా ఉమ్మిడి అప్పలకొండ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చెల్లూరి లక్ష్మి, ఉమ్మిడి సత్యారావు, ఎరిపల్లి రాజునాయుడు, సెక్రటరీలుగా పిల్లి రాములక్ష్మి, పి.నూకనత్నం, పిల్లి లక్ష్మణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ముగ్గురు కాదు.. నలుగురు

- మైనర్లు జోరు.. బాటసారులు బేజారు
- పట్టణ రోడ్లపై రైడింగ్



బస్టాండ్ జంక్షన్ వద్ద ద్విచక్రవాహనంపై నలుగురు మైనర్లు ప్రయాణిస్తున్న దృశ్యం

పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో పట్టణ రోడ్లపై ద్విచక్ర వాహనాలపై మైనర్ల జోరు ఊపందుకుంది. దీంతో పాదచారులు భయపడుతున్నారు. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా సరే.. భయం లేకుండా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇస్తున్నారు. అలాగే కొందరు మైనర్లు ట్రిపుల్ రైడింగ్ కాకుండా ఏకంగా నలుగురు, ఐదుగురు వాహనాలపై వెళుతున్నారు. కొందరు మహిళలు సైతం ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న సందర్భాలు పట్టణ రోడ్లపై దర్శనమిస్తున్నాయి. అమిత వేగంగా వాహనాలు నడుపుతూ కొందరు... బైకులకు మోడ్రన్ సైలెన్సర్‌లు అమర్చి వాహనాలతో పట్టణాన్ని హోరెత్తిస్తున్నారు. మైనర్ల జోరును చూసిన వారంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు. మైనర్ల జోరుకు కళ్లెం వేసేందుకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. -ఆంధ్రజ్యోతి, ఎలమంచిలి

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హాజరు కానున్నారన్నారన్నారు. అవిశ్వాస తీర్మానం వీగిపోయిన తరువాత జరుగుతున్న సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకున్నది.

ఉగ్ర దాడికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ



ఎం.జగన్నాథపురంలో నిర్వహిస్తున్న కొవ్వొత్తులతో ర్యాలీ

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా మండలంలోని ఎం.జగన్నాథపురంలో గ్రామస్థులు సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామ వీధుల్లో జాతీయ జెండాను పట్టుకుని నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంక్షన్ వద్ద ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. మృతి చెందిన వారికి శాంతి కలగాలని ప్రార్థించారు. గ్రామ మాజీ సర్పంచ్ కరెడ్ల ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో మహిళలు, యువత పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్



విద్యార్థులకు పాలిసెట్ హాల్‌టికెట్లు పంపిణీ చేస్తున్న పీఆర్‌టీయూ నేతలు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు ప్రభుత్వ పాఠశాలలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు పీఆర్‌టీయూ నాయకులు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్టు హాల్ టికెట్లను అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గణిత, భౌతిక రసాయన శాస్త్రం ఉపాధ్యాయులైన రమేష్, గోవింద్, శేఖర్, రాజ్‌కుమార్‌లను ఎస్ఐ విభీషణరావు, పీఆర్‌టీయూ నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, సమన్వయకర్త సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోర్ వికాసంపై అవగాహన



కిశోర్ వికాసంపై శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్ లలిత

నక్కపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కిశోర్ బాలికల రక్షణ, సంపూర్ణ ఆరోగ్యం కల్పించాలన్న ఉద్దేశంతో కిశోర్ వికాసం కార్యక్రమం ద్వారా నక్కపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో శ్రీవిద్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కిశోర్ బాలికల ఆరోగ్య పరిస్థితి, బాల్య వివాహాలు జరగకుండా ఎలా నిరోధించాలి? బడిబయట వున్న పిల్లలను గుర్తించి, వారిని పాఠశాలల్లో చేర్పించడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బాలల పరిపరిరక్షణ సమితి జిల్లా ప్రతినిధి డి.లోవరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, తులసి పాల్గొన్నారు.

డ్రాపవుట్స్ లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ఇందిరా దేవి

అచ్యుతాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పిల్లలు డ్రాపవుట్స్ లేకుండా చూడాలని ఐసీడీఎస్ పీవో ఇందిరా దేవి అన్నారు. మంగళవారం స్త్రీశక్తి భవన్‌లో అంగన్‌వాడీలు, ఆశాలు, ఏఎన్ఎంలతో జరిగిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటా సర్వే చేసి పిల్లలను విధిగా అంగన్‌వాడీల్లో చేర్పించాలన్నారు. డ్రాపట్స్ ఉండకుండా చూడాలన్నారు ఈకార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రీ సర్వే పారదర్శకంగా జరగాలి : తహసీల్దార్

నక్కపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినరాంభద్రపురం గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను మంగళవారం తహసీల్దార్ నర్సింహమూర్తి తనిఖీ చేశారు. సిబ్బంది రీ సర్వే చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. రీ సర్వే పారదర్శకంగా పూర్తి చేయాలని, ఏ రైతుకీ ఇబ్బంది కలగకూడదని ఆదేశించారు. సర్వేయర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

అరకు పార్లమెంటు వైసీపీ పరిశీలకుడిగా బొడ్డేడ

మునగపాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకుడుగా బొడ్డేడ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

వైసీపీ నేతలపై తప్పుడు కేసులు తగదు

- నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ఎస్.రాయవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలోని వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టడం తగదని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మంగళవారం ఓ కేసుకు సంబంధించి అరెస్టు అయిన వైసీపీ నేతలను మాకవరపాలెం పోలీసులు అడ్డరోడ్డులోని నక్కపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయానికి తీసుకువచ్చారు. వారిని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులపై ఎన్నో తప్పుడు కేసులు పెట్టడం జరిగిందని ఆరోపించారు. అరెస్టు అయిన వైసీపీ నేతలను రిమాండ్‌కు తరలించే వరకు మాజీ ఎమ్మెల్యే నక్కపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయం వద్దే ఉన్నారు.

ఆస్తి పన్నులో రాయితీకి విశేష స్పందన

- 2722 మంది పథకం సద్వినియోగం
- ఏప్రిల్ నెలలోనే రూ.1.6 కోట్లు వసూలు
- బుధవారం సాయంత్రం వరకు గడువు
- ఐదు శాతం వడ్డీ రాయితీకి ముగియనున్న గడువు



సచివాలయంలో ఆస్తి పన్ను చెల్లిస్తున్న లబ్ధిదారుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను చెల్లింపులో రాయితీకి విశేష స్పందన లభిస్తున్నది. ఈ పథకాన్ని పట్టణ పరిధిలో మంగళవారం నాటికి 2722 మంది సద్వినియోగం చేసుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో చెల్లించాల్సిన ఆస్తి పన్ను మొత్తం ఒకేసారి చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ పథకానికి ప్రభుత్వం ఇచ్చిన గడువు బుధవారంతో ముగుస్తుంది. రెండు అర్ధ సంవత్సరాలు చెల్లించాల్సిన ఆస్తి పన్ను ఒకే సారి చెల్లించడానికి ఏప్రిల్ 1 నుంచి 30 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. ఈ గడువులోపు చెల్లించిన వారికి 5 శాతం పన్ను రాయితీ కల్పించింది.

నర్సీపట్నం మునిసిపాలిటీ పరిధిలో 14,222 ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. రూ.5.16 కోట్లు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. ఆస్తి పన్ను రాయితీ పథకంలో మంగళవారం సాయంత్రానికి 2722 మంది పన్ను చెల్లింపుదారులు వినియోగించుకొన్నారు. ఈ ఒక్క నెలలో రూ.1.6 కోట్లు చెల్లించారని మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. మిగిలినవారు కూడా బుధవారం నాటికి ఆస్తి పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని ఆయన కోరారు.

ముగియనున్న వడ్డీ రాయితీ పథకం

2024-25 ఆర్థిక సంవత్సరంలో బకాయిలు చెల్లించిన వారికి ప్రభుత్వం ఇచ్చిన ఐదు శాతం వడ్డీ రాయితీ పథకం కూడా బుధవారంతో ముగియనుంది. బకాయిలు ఎవరైనా చెల్లించాల్సి వారు ఉంటే, వెంటనే చెల్లించి రాయితీ పొందాలని కమిషనర్ సూచించారు. లేనిపక్షంలో మే 1 నుంచి వడ్డీతో పాటు ఆస్తి పన్ను మొత్తం చెల్లించాల్సి వస్తుందని, ఐదు శాతం రాయితీ వర్తించదని ఆయన తెలిపారు.

జూన్‌లోపు మొదటి అర్ధ సంవత్సరం పన్ను కట్టాలి

2025-26 మొదటి అర్ధ సంవత్సరం పన్ను ఏప్రిల్ నుంచి జూన్ లోపు, రెండో అర్ధ సంవత్సరం పన్ను అక్టోబరు నుంచి డిసెంబరులోపు చెల్లించాలి. ఆ విధంగా గడువులోపు చెల్లించని వారికి 2 శాతం వడ్డీ పడుతుందని అధికారులు తెలిపారు. గడువులోపు పన్ను చెల్లించని వారు కట్టాల్సిన పన్ను మీద 2 శాతం వడ్డీతో ప్రభుత్వానికి చెల్లించాలి.



కొరుప్రోలులో గిరిజనులతో మాట్లాడుతున్న ఆర్డీవో వీవీ రమణ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఆర్డీవో

రోలుగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కొరుప్రోలులో పింఛన్లు, రేషన్ కార్డులు లేని వారి వివరాలు సేకరించి తక్షణమే నివేదికలు తయారు చేయాలని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం గిరిజన గ్రామం కొరుప్రోలును సందర్శించి గిరిజనులతో మాట్లాడారు. పలువురు గిరిజనులు నేటికీ రేషన్ కార్డులు, పింఛన్లు లేవని, వాటిని మంజూరు చేయాలని ఆర్డీవోను కోరారు. ఇటీవల వికలాంగుల పింఛన్ ఆగిపోయిందని, పునరుద్ధరించాలని గ్రామానికి చెందిన గెమ్మెలి ఆనంద్ మొర పెట్టుకున్నారు. అర్హత కలిగిన వారందరికీ త్వరలోనే రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంకేపట్నం నుంచి కొరుప్రోలు గ్రామానికి రూ.1.5కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమ్మ, ఆర్‌ఐ రామమూర్తి, వీఆర్వో రాజులమ్మ, టీడీపీ నాయకులు మడ్డు పైడితల్లినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలి

- వైద్యాధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించి పనితీరు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ పురోగతి, పనితీరు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే ప్రసవాలు, దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం వంటి వ్యాధులకు శస్త్ర చికిత్సలు జరిగేలా చూడాలని ఆదేశించారు. అలాగే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న, గర్భిణులను ముందుగా గుర్తించి, వారికి అవసరమైన వైద్యసేవలు అలందించాలన్నారు. వంద శాతం నాన్-కమ్యూనికేబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) సర్వే చేయాలని, వేసవి కాలం దృష్ట్యా ప్రజలు వడదెబ్బలు బారిన పడకుండా అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసి ప్రాథమిక చికిత్స నిమిత్తం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసి క్యాన్సర్ బారిన పడిన వారిని గుర్తించాలన్నారు. అనంతరం వారికి సరైన చికిత్స అందించాలని సూచించారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగేలా చూడాలని చెప్పారు. మలేరియా, డెంగ్యూ కేసులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతర ముహూర్తం రాట రేపు

- ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుప్పాల అప్పలరాజు

మాడుగుల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జూన్ నెలలో జరగనున్న మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతరకు గురువారం ఉదయం అమ్మవారు శతకంపట్టు వద్ద ముహూర్తపు రాట వేస్తున్నామని ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జూన్ మూడో తేదీన మాడుగుల మోదకొండమ్మ జాతరను వైభవంగా నిర్వహించేందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గురువారం ఉదయం ఏడుగంటల 45 నిమిషాలకు అమ్మవారి గుడి వద్ద పండగ చాటింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ఆరో తేదీన మంగళవారం ఉదయం 9గంటల 5నిమిషాలకు మోదకొండమ్మ ఆలయం నుంచి అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకు వెళ్లి 9.45గంటలకు అమ్మవారి శతకంపట్టు వద్ద కొలువుదీరుతుందన్నారు. నెల రోజులపాటు అమ్మవారి ఘటాలు, పాదాలను జూన్ 3వ తేదీ వరకు ఉంటాయని, రాత్రి 7.20గంటలకు ప్రధాన ఆలయానికి ఊరేగింపుగా తిరిగి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధు శ్రీనివాసరావు, కొట్యాడ మల్లికార్జునుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- తారు రోడ్లుగా లింకు మార్గాల అభివృద్ధి
- రాకపోకలు సులభం.. ప్రజల ఆనందం



తారు రోడ్డుగా అభివృద్ధి చెందిన నాతవరం-గొలుగొండ మార్గం

గొలుగొండ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ లింకు మార్గాలకు మహర్దశ పట్టింది. పలు లింకు మార్గాలు తారు రోడ్లుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇందులో భాగంగా గొలుగొండ, నాతవరం రోడ్డును రెండు కిలోమీటర్ల మేర తారు రోడ్డుగా అభివృద్ధి చెశారు. ఫలితంగా రాకపోకలు సులభతరం కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాతవరం-గొలుగొండ మండలాలకు 2018లో చింతకాయల అయ్యన్నపాత్రుడు తాండవ రిజర్వాయర్ అంచులో కొండపై సుమారు రూ.4 కోట్లతో రోడ్డు ఏర్పాటు చేశారు. అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో సాలికమల్లవరం, పొగచెట్లపాలెం మధ్య రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం అటవీ అనుమతులు తీసుకువచ్చి రూ.80 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. దీంతో నాతవరం మీదుగా తూర్పుగోదావరి జిల్లాకు ప్రయాణం సులభతరం కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఐటీఐ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

నర్సీపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు మే 24 సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మే 26వ తేదీలోగా దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలన్నారు. మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చకూడదని ఆయన స్పష్టం చేశారు. ఆధార్‌లోని వివరాలు, పదో తరగతి సర్టిఫికెట్ వివరాలు ఒకేలా ఉండాలని చూసుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులు ఐడీ స్లిప్‌తో ఒరిజినల్ సర్టిఫికెట్లతో దగ్గరలోని ఐటీఐలో పరిశీలన చేయించుకోవాలని కన్వీనర్ తెలిపారు.

జీజే కళాశాలలో ప్రవేశాలు

- నాలుగు గ్రూపుల్లో అడ్మిషన్లు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ కె.శ్రీహరి తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఈ మేరకు కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. కాగా, కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులతో అధ్యాపకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కళాశాలలో పూర్తి స్థాయిలో అధ్యాపకులు, ఫర్నిచర్ తదితర సదుపాయాలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 8309103820, 9912578139 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వజ్రోత్సవాలకు రైతులు తరలి రావాలి

- కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయంలో జరిగే వజ్రోత్సవాలల్లో రైతులంతా పాల్గొనాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్ కోరారు. మంగళవారం కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో కేపీ అగ్రహారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న కమతాలలో స్థిరమైన ఆదాయం పొందేందుకు, మెలకువలు నేర్చుకోవడానికి ఈ వజ్రోత్సవాలు దోహదపడాయన్నారు. అక్కడ ఏర్పాటు చేసే స్టాళ్లలో ఎన్నో అధునాతన వ్యవసాయ పరికరాలు ఏర్పాటుచేస్తారన్నారు. వ్యవసాయంలో అధిక లాభాలు పొందేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆటల పోటీలు

చోడవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం గ్రంథాలయాధికారి జి. తిరుమలకుమారి చిన్నారులకు ఆటలు పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు నీతికథల పోటీలు నిర్వహించారు.

చీడికాడలో...

చీడికాడ గ్రంథాలయంలో మంగళవారం ఆటల పోటీలు, కథలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారి ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. సుమారు 20మంది విద్యార్థులు హాజరయ్యారు.

విజ్ఞాన యాత్రకు ములకలాపల్లి పాడి రైతులు



విజ్ఞాన యాత్రకు బయలుదేరిన ములకలాపల్లి పాడి రైతులు

దేవరాపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో మండలంలోని ములకలాపల్లి పాడి రైతులు మంగళవారం విజ్ఞాన యాత్రకు తరలివెళ్లారు. మేలు జాతి పశువుల పోషణ, వ్యాధులు రాకుండా పశువుల పెంపకంలో తీసుకోవలసిన మెలకువల గురించి సిబ్బంది రైతులకు అవగాహన కలిగించనున్నారని పాలసంఘం అధ్యక్షుడు సంజీవ్, కార్యదర్శి ప్రసాదు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెయిరీ పర్యవేక్షకులు కృష్ణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

దేవరాపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన అవసరమని కె.కోటపాడు సీడీపీవో వి.మంగతాయారు అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో కిశోర వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా కార్యదర్శులు, వీవోఏలకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. 11 నుంచి 18 సంవత్సరాలలోపు కిశోర బాలికలకు వారానికి రెండు రోజులు చొప్పున 36 సెషన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రవేశ పరీక్షల శిక్షణ తరగతులు

దేవరాపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాలిసెట్, ఏపీఆర్‌జేసీలపై శిక్షణ ఇవ్వడం వలన ఎంతో మేలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. మంగళవారం స్థానిక ఉషోదయ పాఠశాల ఆవరణలో జరిగిన పాలిసెట్, ఏపీఆర్జేసీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. ఈ ఉచిత శిక్షణలో ఎంతో మందికి ఉపయోగపడిందన్నారు. కార్యక్రమంలో పెద్దాడ వెంకటరమణ, కె.శ్రీను, సంతోష్ పాల్గొన్నారు.

మూడు కేజీబీవీల్లో 18 అదనపు గదుల నిర్మాణం

- చోడవరం ఎమ్మెల్యే రాజు



గర్నికం కేజీబీవీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే రాజు, అధికారులు, నాయకులు

రావికమతం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చోడవరం నియోజక వర్గంలోని మూడు కేజీబీవీ పాఠశాలల్లో 18 అదనపు తరగతి భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండలంలో గర్నికం కేజీబీవీ పాఠశాలలో నిర్మించనున్న ఆరు తరగతి గదులకు మంగళవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోలుగుంట, వడ్డాది, గర్నికం కేజీబీవీలు వసతి సమస్య ఎదుర్కొంటున్నాయన్నారు. ఈ సమస్యను ఆయా పాఠశాలల సిబ్బంది తన దృష్టికి తీసుకు రాగా సమగ్ర శిక్ష అభియాన్ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించినట్టు చెప్పారు. తరగతి గదులను త్వరగా పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారావుకు సూచించారు. ఈ సందర్భంగా మరుపాక ఏపీ మోడల్ స్కూల్‌లో హాస్టల్ నిర్మాణం చేపట్టాలని ఆ గ్రామానికి చెందిన ఎంపిటీసీ మాజీ సభ్యుడు జెర్రిపోతల రాంబాబు తదితరులు ఎమ్మెల్యే రాజుని కోరారు. మరుపాకలో ఉపాధి హామీ శ్రామికుల కూలి సొమ్ము పక్కదారి పట్టడంపై విచారణ చేయించాలని ఎంపిటీసీ సభ్యుడు ఎం.సూర్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, నాయకులు కోట గోవిందరావు, గొంప ఎంపిటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, పాలసంఘం అధ్యక్షుడు కె.శ్రీను, కేజీబీవీ స్పెషలాఫీసర్ భాను పాల్గొన్నారు.

రోలుగుంటలో..

కేజీబీవీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రస్తుత ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు అన్నారు. మంగళవారం రోలుగుంట కేజీబీవీలో రూ.1.66 కోట్లతో నిర్మించే అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ నరసింగరావు, డీఈ సుబ్బలక్ష్మి, ఏఈ సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల రామకృష్ణ, సర్పంచ్ వరలక్ష్మి, ఎస్ఓ తులసీ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

మండలంలో వడ్డాది కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమములో వడ్డాది కేజీబీవీ ఎస్‌వో అన్నపూర్ణ, చైర్మన్ సత్యవేణి, జీసీడీవో పద్మ, ఎస్ఎస్ఏ ఈఈ డీవీ నరసింహారావు, డీఈఈ సుబ్బలక్ష్మి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, దొండా నరేష్, సన్యాసిరావు, దొడ్డి కిశోర్, గోకివాడ కోటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం బుచ్చెయ్యపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షలతో చేపట్టనున్న ల్యాబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటకృష్ణ, సర్పంచ్ సుంకర లక్ష్మి, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో భారీ వర్షం



కొమిరలో కురుస్తున్న వర్షం

రావికమతం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సోమ, మంగళవారాల్లో 17.08 ఎంఎం వర్షం కురిసింది. ఎండలకు ఉక్కిరిబిక్కిరవుతున్న జనం ఈ వర్షానికి ఉపశమనం పొందారు. వర్షం సరుగుడు తోటలు, చెరకు కార్శి తోటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగులలో..

మాడుగులలో మంగళవారం మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎండ తీవ్రత ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

4న బొగొండమ్మ అమ్మవారి పండగ

చీడికాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాంలో మే 4వ తేదీన బొగొండమ్మ అమ్మవారి పండగ నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు చలుగు దేముడునాయుడు, చలుగు పెదసత్యనారాయణ, చలుగు అప్పలనాయుడు, సమాల అబ్బాయిదొర, చలుగు సత్యనారాయణ, కిముడు సన్యాసిరావు తెలిపారు. మంగళవారం వారు పండగ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆదివారం ఉదయం పూజలతో ప్రారంభమవుతుందన్నారు.

నేరేడుబందలో ఆరుగురికి మలేరియా



జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మలేరియా అధికారులు

రావికమతం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చీమలపాడు పంచాయతీ శివారు నేరేడుబందలో ఆరుగురికి మలేరియా జ్వరాలు సోకినట్టు చోడవరం సబ్ యూనిట్ మలేరియా అధికారి అధికారి రమణ తెలిపారు. ఈ గ్రామంలో 13 మంది జ్వరాలతో మంచం పట్టారని ఈనెల 25వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. మంగళవారం మలేరియా అధికారి రమణ, ఎల్‌టీ మహేష్, హెచ్ఎస్.రమణ నేరేడుబంద గ్రామానికి వెళ్లి జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించగా.. ఆరుగురికి మలేరియా సోకినట్టు నిర్ధారించారు. జ్వర బాధితులకు అవసరమైన మందులు అందజేసినట్టు మలేరియా అధికారి రమణ తెలిపారు. అనంతరం గ్రామంలో ఇంటింటా మలేరియా నివారణకు దోమల మందు స్ప్రేయింగ్ చేయించారు. దోమ తెరలు వాడాలని, రోజూ కాచి వడపోసిన వేడి నీటినే తాగాలని సూచించారు.



గిరిజనుల ఇళ్లలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

గ్రామాల్లో టీడీపీ కమిటీల నియామకం



సత్యవరంలో సమావేశమైన టీడీపీ నాయకులు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపెన, జాలంపల్లి, లోవ పొన్నవోలు, సత్యవరం గ్రామాల్లో మంగళవారం తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం జరిగింది. జంపెనలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యన్నంశెట్టి కొండలరావు, రాకోటి చిన్నోడు, జాలంపల్లిలో బాణం బీమలింగేశ్వరరావు, బచ్చల కన్నయ్యదొర, లోవ పొన్నవోలులో యన్నంశెట్టి సత్యారావు, రమేశబాబు, సత్యవరంలో జెర్రిపోతుల సూర్యనారాయణ, జాజుల శ్రీనులను నియమించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఈకేవైసీ గడువు పెంచాలి



ఈకేవైసీ చేయించుకుంటున్న విద్యార్థులతో బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ గడువు పెంచాలని బీజేపీ మండల అధ్యక్షుడు కాకూరి శేఖర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈకేవైసీ గడువు ఈనెల 30తో ముగుస్తోందన్నారు. గిరిజన ప్రాంతంలో శివారు గ్రామాల ఆదివాసీలకు ఈకేవైసీ నమోదు పూర్తికాలేదన్నారు. సాంకేతిక సమస్యతో ఇప్పటికి 20శాతం మంది ఆదివాసీలు మాత్రమే ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ చొరవ తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక అనుమతితో ఈకేవైసీ గడువు పెంచాలన్నారని కోరారు.

ఫారంఫండ్స్ పనులు పూర్తి చేయాలి: ఎంపీడీవో



మండపర్తిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఏపీవో

అనంతగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కాశీపట్నం పంచాయతీ మండపర్తి గ్రామంలోని జాతీయ ఉపాధిహామీ పనులను ఎంపీడీవో ఏవీవీ కుమార్, ఏపీవో సన్యాసినాయుడు మంగళవారం పరిశీలించారు. కూలీలకు పలు సూచనలందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఏవీవీ.కుమార్ మాట్లాడుతూ.. పంచాయతీకి 25 చొప్పున ఏర్పాటు ఫారంఫండ్ పనులను సకాలంలోని పూర్తికి క్షేత్రస్థాయి సిబ్బంది కృషిచేయాలన్నారు. కూలీలకు రోజుకు రూ.307 గిట్టుబాటయ్యేలా చూడాలని ఆదేశించారు.

'ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలను విజయవంతం చేయాలి'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ దుర్జో, సచివాలయ ఉద్యోగులు

సీలేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో త్వరలో అంతర్జాతీయ సాహితీ సేవా సంస్థ కళావేదిక ఆధ్వర్యంలో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలను విజయవంతం చేయాలని వక్తలు కోరారు. స్థానిక సర్పంచ్ పాంగి దుర్జో, కళావేదిక అధ్యక్షుడు నూనె రమేశ్ మంగళవారం ఈ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కళావేదిక చేస్తున్న సాహితీ పరంగా, సామాజిక సేవలను అభినందించారు. తెలుగు భాష పరిరక్షణకు ఈ సంబరాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రామావతి, అధ్యక్షులు జి. ఈశ్వరి, గ్రామ సచివాలయం సిబ్బంది బత్తుల విజయకుమారి, జోరంగి అనుష్క, లింగేటి లోవకుమారి, రేవతి, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

చింతపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి ఆటపాటలతో ప్రాథమిక విద్యను అభ్యసించేలా ఏర్పాట్లు చేసినట్టు గ్రంథాలయం అధికారి సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యల్లో లుగసరిపుట్టు

- అధ్వానంగా రహదారి
- అంగన్‌వాడీ కేంద్రానికి భవనం కరవు

పెదబయలు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంతుర్ల పంచాయతీ పరిధి లుగసరిపుట్టు గ్రామానికి పక్కా రహదారితో పాటుపలు సమస్యలు వేధిస్తున్నాయి. ప్రధానంగా సరైన రోడ్డు సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో తీవ్ర అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్ల క్రితం గ్రామానికి గ్రావెల్ రోడ్డు నిర్మించి దానిపై బీటీ వేయకుండా వదిలేశారు. దీంతో ఏటా వర్షాలకు ఈ రోడ్డుకోతకు గురై భారీ గుంతలతో నడవడానికి వీలులేనంత అధ్వానంగా తయారైందని స్థానికులు వాపోయారు. గ్రామంలో ఎవరికైనా అనారోగ్యంతో మంచాన పడితే అంబులెన్స్ గ్రామానికి వచ్చే పరిస్థితిలేదని వాపోయారు. దీనివల్ల డోలీల ద్వారా కుంతర్ల పంచాయతీ కేంద్రం వరకు మోసుకువెళ్లాల్సి వస్తోందని వాపోయారు. కొన్నిసార్లు గర్భిణులకు మార్గ మధ్యలో ప్రసవం జరిగి



కార్యకర్త ఇంటి వరండాలో అంగన్‌వాడీ చిన్నారులు



గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి

తల్లీబిడ్డా ప్రాణాలు కోల్పోయిన సందర్భాలున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రతీ నెలా రేషన్ బియ్యం కోసం గ్రామం నుంచి కుంతుర్లకు వెళ్లి మోసుకు వస్తున్నామని తెలిపారు. అలాగే, గ్రామంలో సుమారు 25 మంది చిన్నారులు ఉన్నా అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం లేక కార్యకర్త ఇంటి వరండాలోనే కొనసాగుతుందన్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని గ్రామస్థులు రాంబాబు, ప్రసాద్, సత్యబాబు, భాస్కర్, రాజందొర, సన్యాసినాయుడు తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

ఫలించిన పోలీసుల ముందస్తు వ్యూహం

- అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా ముగిసిన ముత్యాలమ్మ జాతర

చింతపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కిందట ముగిసిన స్థానిక ముత్యాలమ్మ జాతరలో భక్తులు, వీఐపీలకు భద్రత కల్పించడంలో పోలీసులు విజయవంతమయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చేపట్టిన ముందస్తు వ్యూహం ఫలించింది. జాతరకు వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. 12 ఏళ్ల క్రితం ఈ జాతరలో స్థానిక పాత బస్టాండ్ వద్ద సీపీఐ మావోయిస్టు యాక్షన్ టీం సభ్యులు బాలరాజు అనే హోంగార్డుని అతి సమీపం నుంచి తుపాకీతో కాల్చిచంపారు. నాటి నుంచి జాతరకు భద్రతను నాలుగు రెట్లు పెంచారు. ఈ ఏడాది 300 మందికిపైగా పోలీసులు, పది మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 20మంది ఎస్‌ఐలను నియమించారు. పరిసర గ్రామాల్లో గ్రేహౌండ్స్ ఏపీఎస్పీ, సీఆర్‌పీఎఫ్ బలగాలతో జాతర ప్రారంభానికి వారం రోజుల ముందు నుంచే గాలింపు చర్యలు ప్రారంభించారు. ఈఏడాది జాతర ప్రారంభానికి వారం రోజుల ముందే ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టు అగ్రనేతలు రంపచోడవరం-పాడేరు రెవెన్యూ డివిజన్ల సరిహద్దు గ్రామాల్లోకి వచ్చినట్టు పోలీసు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో పోలీసు యంత్రంగం అప్రమత్తమైంది. ప్రత్యేక పోలీసు బలగాలతో కూంబింగ్‌ను ప్రారంభించారు. చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా పర్యవేక్షణలో జాతర భద్రత కోసం అదనపు పోలీసులను నియమించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్పీ



హనుమాన్ జంక్షన్‌లో పోలీసుల చెక్‌పోస్టు వద్ద సీఐ, పోలీసులు (ఫైల్)

అతిథి గృహం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పోలీసు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. జాతరలో అనుమానితులను చెక్ పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించి పంపించేవారు. ప్రధాన రహదారి, సాంస్కృతిక కార్యక్రమాల వద్ద పోలీసుల బందోబస్తు కల్పించారు. దీనికి తోడు మఫ్టీలో నున్న సంచార క్యాట్ పార్టీలను నియమించారు. రాత్రి వేళ గ్రామం చుట్టూ డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించారు. మావోయిస్టు యాక్షన్ టీం సభ్యులు ఎవరైన వచ్చారా? అని పరిశీలించేవారు. ప్రధానంగా చింతపల్లి సీఐ ఎం. వినోద్‌బాబు పర్యవేక్షణలో ప్రణాళిక ప్రకారం పోలీసులకు విధులు కేటాయించారు. ఓవైపు ట్రాఫిక్, మరోవైపు దర్శనానికి వచ్చే భక్తులు, వీఐపీలకు (ప్రజాప్రతినిధులు) భద్రత కల్పించారు. జాతర నాలుగు రోజులు ఎటువంటి సమస్య తలెత్తకుండగా పోలీసులు తీసుకున్న చర్యలు ఫలించడంతో ప్రజలు, ఉన్నతాధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

నాణ్యతతో రహదారి పనులు చేపట్టాలి



రహదారి పనులను పరిశీలిస్తున్న వైసీపీ నేతలు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో మారుమూల గ్రామాల్లో చేపడుతున్న పక్కా రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జేవీవీఎస్ మూర్తి కోరారు. మంగళవారం ఆయన మండలంలోని మారుమూల బుంగాపుట్టు పంచాయతీ కేంద్రం నుంచి పులజల్మ వరకు జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతతో ఈ నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలకు రహదారులు నిర్మించినట్టు చెప్పారు. అలాగే, అప్పటి ఎమ్మెల్యే, ఎంపీలతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ చొరవతో బుంగాపుట్టు నుంచి పులజన్మ గ్రామం వరకు రహదారి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నొబిన, వైసీపీ నేతలు పద్మారావు, అర్జున్, అప్పారావు, సన్యాసిరావు, రాజారావు, సాధూరాం, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండవేడి, ఉక్కపోత

- కొయ్యూరులో 37.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత



పాడేరులో మంగళవారం ఉదయం పొగమంచులో సూర్యోదయం

పాడేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వాతావరణం మార్పుతో ఏజెన్సీలో మంగళవారం మబ్బుల వాతావరణం కొనసాగింది. గత కొన్ని రోజులుగా ఏజెన్సీలో వర్షం కురుస్తున్న సంగతి తెలిసిందే. అయితే శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకు పొగమంచు కురిసి, ఆతర్వాత నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు తీవ్రంగా ఎండ కాసింది. అనంతరం ఆకాశం పూర్తిగా మేఘావృతమైనప్పటికీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు మాత్రం తగ్గలేదు. వేడి ప్రభావం ఉక్కపోత కొనసాగింది. మంగళవారం కొయ్యూరులో 37.7 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా పాడేరులో 37.3, అరకులోయ లో 33.5, డుంబ్రిగుడ, అనంతగిరిలో 33.0, జీకేవీధి, హుకుంపేటలో 32.0, చింతపల్లిలో 31.8, పెదబయలులో 30.9, జి.మాడుగులలో 30.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'పత్రికా రంగంలో విలువలకు ప్రాధాన్యం'

అరకులోయ,ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పాత్రికేయ వృత్తిలో విలువలకు ప్రాధాన్యమివ్వాలని సీనియర్ పాత్రికేయుడు,అరకు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎల్‌బీ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అరకులోయలో మండలంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏపీయూడబ్ల్యూజే సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పాత్రికేయులు డేవిడ్, రెహమాన్,రవి, గోవర్ధన్ ,హరిబాబు, రమేశ్‌బాబు,భీమన్న, ప్రణీత్, కొండ, సంజీవ్,అనిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అరకు పార్లమెంటు వైసీపీ పరిశీలకుడిగా బొడ్డేడ

మునగపాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకుడుగా బొడ్డేడ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పంపిణీకి లక్ష మొక్కలు సిద్ధం: పెదవలస రేంజర్ శివరంజని



కాకరపాడు నర్సరీలో పెంచుతున్న మొక్కలు



రేంజర్ శివరంజని

కొయ్యూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అటవీశాఖ ఆధ్వర్యంలో కాకరపాడు నర్సరీలో పెంచుతున్న మొక్కలు జూన్ మొదటి వారం నుంచి రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పెదవలస రేంజర్ శివరంజని తెలిపారు. మంగళవారం కొయ్యూరు అటవీ సెక్షన్, శింగవరం కలప డిపో, కాకరపాడు నర్సరీని రేంజర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాకరపాడు నర్సరీ ద్వారా యూకలిప్టస్, సరుగుడు, జాఫ్రా తదితర లక్ష మొక్కలను పెంపకం చేపట్టినట్టు వివరించారు. వీటిని రైతుల డిమాండ్ ఆధారంగా పంపిణీ జూన్‌నుంచి అందిస్తామన్నారు. వచ్చే ఏడాది ఈ నర్సరీలో 2 లక్షల మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కంపా పథకంలో రేంజ్ పరిధిలోని సింగినాపల్లి కొత్తూరు అటవీ ప్రాంతంలో 10 హెక్టార్లలో మిక్స్‌డ్ ప్లాంటేషన్ చేపడుతున్నామన్నారు. అటవీ సంరక్షణ చర్యల్లో భాగంగా కొండవాలు ప్రదేశాలలో రిక్వాయిర్‌మెంట్‌ను బేస్ చేసి 3 వేల ట్రెంచ్‌లు తవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. దీనికి సంబంధించి నూతన ఎఫ్‌హెచ్‌ఆర్ మేరకు ప్రభుత్వం మంజూరు చేసే నిధుల మేరకు పనులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు గంగవరం, బొయింతి రిజర్వు ఫారెస్టుల్లో 80 చోట్ల అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. ఇకపై అగ్ని ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారణకు పక్కాగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు అటవీ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

పీవీటీజీలు శతశాతం ఆధార్ కార్డు కలిగి వుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీవీటీజీలు శతశాతం ఆధార్ కార్డు కలిగి ఉండాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ అన్నారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఏ, వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో పీవీటీజీలకు ఆధార్ కార్డులులేవన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా పరిగణిస్తున్నట్టు పేర్కొన్నారు. వీఆర్ఏలు, వీఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పీవీటీజీలందరికీ ఆధార్ కార్డు కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్టు గుర్తించామన్నారు. ప్రధానంగా జీకేవీధి ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలపై విచారణ చేపట్టి తొలగిస్తామన్నారు. అలాగే వారసత్వ భూములను కుటుంబ సభ్యులు మ్యుటేషన్ చేయించుకోవాలన్నారు.

టీడీపీ చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆనందరావు



ఎన్నికైన నూతన గ్రామ కమిటీ

చింతపల్లి, ఏప్రిల్ 29 (ఆంధజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రీమల ఆనందరావుని కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం స్థానిక గిరిజన భవన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నూతన గ్రామ కమిటీలను నియమిస్తున్నట్టు చెప్పారు. స్థానిక. మేజర్ పంచాయతీలో గ్రామ కమిటీ అధ్యక్షుడితోపాటు ఉపాధ్యక్షుడుగా కోరాబు గాంధి పడాల్, ప్రధాన కార్యదర్శిగా అరసవల్లి అనీల్ కుమార్, కార్యదర్శిగా రుత్తల అర్జున్, బేతా నూకరత్నం, కాశీంవల్లి, సహాక కార్యదర్శిలుగా కొర్ర చిన్న, గోవింద్, కిల్లో సుబ్బారావు ఎన్నికైనట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కో నాగభూషణం, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు దూరి రామకృష్ణ పాల్గొన్నారు.

మారెమ్మకు బంగారు, వెండి ఆభరణాలు బహూకరణ



బంగారు, వెండి ఆభరణాలందజేస్తున్న భక్తుడు

సీలేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ దేవత మారెమ్మకు ఒడిశాకు చెందిన భక్తుడు బంగారు, వెండి ఆభరణాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. మంగళవారం ఒడిశాలోని చిత్రకొండ గ్రామానికి చెందిన వ్యాపారి మునికోటి శ్రీనివాస్, లోవ శ్రావణి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.2 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు బహూకరించారు.

గిరిజన టీచర్ల సమస్యలపై టీడబ్ల్యూ డైరెక్టర్‌కు వినతి

పాడేరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ విద్యాశాఖలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.భార్గవి దృష్టికి తీసుకువెళ్లినట్టు గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ తెలిపారు. టీడబ్ల్యూ డైరెక్టర్‌కు ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే నెలలోనే టీచర్ల బదిలీలను నిర్వహించాలని, భాషా పండితులు, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు కల్పించాలని, అర్హులైన కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లను రెగ్యులర్ చేయాలని, షెడ్యూల్, నాన్‌షెడ్యూల్ ప్రాంతాల్లోని ఒకే విధానాన్ని అమలు చేయాలని కోరామన్నారు. మండల కేంద్రాల్లో, దూరప్రాంతాల్లోని పాఠశాలలకు ఒకే విధానంలో విద్యార్థుల అడ్మిషన్లు జరగాలని, బ్యాక్‌లాగ్ ఖాళీల్లో ఇన్ సర్వీస్ టీచర్లకు పదోన్నతులు కల్పించాలని, హిందీ స్కూల్ అసిస్టెంట్‌లకు పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాలని విన్నవించినట్టు చెప్పారు. స్కూళ్ల పునఃప్రారంభం నాటికే టీచర్లకు అవసరమైన శిక్షణలు అందించాలని కోరినట్టు వివరించారు. ఈకార్యక్రమంలో



టీడబ్ల్యూ డైరెక్టర్ ఎస్.భార్గవికి వినతిపత్రమిస్తున్న సంఘం నేతలు

టీడబ్ల్యూ టీచర్ల సంఘం నేతలు శేషగిరిరావు, రంగారావు, సత్యనారాయణ, కె.నీలకంఠం, మంగారెడ్డి, కె.గాంధీబాబు, కె.పూర్ణచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

గొబ్బిరిగుడలో వైద్య శిబిరం

- డోలీ మోతపై స్పందించిన వైద్య శాఖ

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ గొబ్బిరిపడలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 58 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు అనారోగ్యం బారిన పడటంతో డోలీ సహాయంతో పీహెచ్‌సీకి తరలించారని పత్రికల్లో వచ్చిన కథనాలకు లబ్బూరు వైద్యాధికారి శ్యాంప్రసాదు స్పందించారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వ్యాధులు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గిరిజనులకు వివరించారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామాలకు పక్కా రహదారులు నిర్మాణం పనులు జరిగేలా అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మన్యం బంద్ విజయవంతం చేయాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు

అరకులోయ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై మే 2న తలపెట్టిన మన్యం బంద్ విజయవంతం చేయాలని పలువురు నాయకులు కోరారు. మండల కేంద్రంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు.. మాట్లాడుతూ.. స్పెషల్ డీఎస్సీలోని అల్లూరి జిల్లాకు 400 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసి, అందులోని ఎస్టీలకు 24 పోస్టులు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. గిరిజన ప్రాంతంలోని 100శాతం పోస్టులను గిరిజనులకు కేటాయించేలా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోని పీఆర్టీయూ నాయకుడు ప్రకాశ్, యూటీఎఫ్ నాయకుడు దేముడు, మోహన్, జగన్నాథం, పోతురాజు, ప్రసన్న, సురేశ్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



అరకులోయలో రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ కేటాయించాలి

హుకుంపేట: గిరిజనులకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని వైస్ ఎంపీపీ కొండలరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యాక్షురాలు హైమావతి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక స్పెషల్‌డీఎస్సీ గిరిజన సాధన కమిటీ అధ్యక్షులు టి. కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యావంతులతో కలిసి ర్యాలీ నిర్వహించి పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేతలు



హుకుంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యావంతులు, గిరిజన నేతలు

మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో అరకులో సభలో ఇచ్చిన హామీ మేరకు జీవో 3 పునరుద్ధరించాలన్నారు. పార్వతీపురం, పాడేరు ఏజెన్సీలలో ఖాళీగా 881 టీచర్ పోస్టులు గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. ప్రస్తుత డీఎస్సీలో గిరిజనులకు 24 పోస్టుల ఖాళీలు చూపడం అన్యాయమన్నారు. స్పెషల్ డీఎస్సీ సాధనకు ఈ నెల 30న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యావంతులు గండేరి సత్యం, రంజిత్ , నైని సత్తిబాబు, చప్పలి శంకర్, లక్ష్మణరావు, జన్ని వెంకరమణ, రామకృష్ణ, భరత్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏ ముట్టడి

జి.మాడుగుల : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీకి వ్యతిరేకంగా బుధవారం నిర్వహించనున్న పాడేరు ఐటీడీఏ ఐటీడీఏ ముట్టడిని ప్రజా సంఘాలు, మేధావులు పార్టీలతీతంగా తరలివచ్చి సంఘీభావం తెలుపాలని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ నేత సమిరెడ్డి మాణిక్యం పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు జీవో 3 బదులుగా ప్రత్యామ్నాయ జీవో అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమేరకు తలపెట్టిన ఐటీడీఏ ముట్టడికి ప్రజా సంఘాలు, రాజకీయ ప్రతినిధులు మద్దతు తెలపాలని కోరారు.


కుట్టు మిషన్ల శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ఉపాధి శిక్షణతో మహిళల ఆర్థికాభ్యున్నతి

» ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి శిక్షణతో మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించవచ్చునని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. మండల కేంద్రంలోని అరబిందో కమ్యూనిటీ హాలులో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం స్వయం ఉపాధి కార్యక్రమాలకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని చెప్పారు. వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీశ్, బుదిరెడ్డి మోహన్, వేగి కోటి పాల్గొన్నారు.

కోట్ని బాలాజీకి టీడీపీ నేతల సత్కారం


కోట్ని బాలాజీని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

తుమ్మపాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ ఛైర్మన్‌గా నియమితుడైన టీడీపీ నాయకుడు కోట్ని బాలాజీని పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. బవులవాడ గ్రామంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఎన్నికైన బాలాజీపై అధిక సంఖ్యలో అభిమానులు ప్రశంసల వర్షాన్ని కురిపించారు. ఈ సందర్భంగా కశింకోట మండల టీడీపీ అధ్యక్షుడు కాయల మురళీ మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారికి పదవులు వరించడం ఖాయమన్నారు. అతి చిన్న వయసులో పలు పదవులను చేపట్టిన ఘనత బాలాజీదేనన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను బాలాజీ అధిరోహించడం ఖాయమన్నారు. పార్టీలో నమ్మకంగా కొనసాగుతున్న వారికి సముచిత స్థానం తప్పకుండా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

» వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పచ్చికూర రాము


మామిడిపాలెంలో ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ నాయకులు

తుమ్మపాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పచ్చికూర రాము కోరారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో మంగళవారం జరిగిన టీడీపీ గ్రామ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యధిక కార్యకర్తలు ఉన్న ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. పేదల పక్షంగా పోరాటాలు చేసే పార్టీ అన్నారు. కార్యకర్తలకు పార్టీ నిత్యం అండగా ఉంటుందని చెప్పారు. గ్రామంలో నిర్వహించిన సంస్థాగత ఎన్నికల్లో నియమితులైన వారు పార్టీలో నమ్మకంగా కొనసాగుతూ గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, చెక్కల శ్రీనివాసరావు, మాకవరపు సత్యనారాయణ, బత్తుల రమేశ్, దండుపాటి గంగరాజు, కర్రి బాబి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా తాడి తరలింపు సర్వే


సర్వేలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

పరవాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామం తరలింపునకు రెవెన్యూ అధికారులు చేపడుతున్న సర్వే ప్రక్రియ చురుగ్గా కొనసాగుతున్నది. ఇందులో భాగంగా సర్వే కోసం ముగ్గురు అధికారులతో కూడిన ఎనిమిది బృందాలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. మంగళవారం చినతాడి, పెదతాడి, తాడి బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి గ్రామస్థుల నుంచి వివరాలను సేకరించారు. మరో వారం రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్వీ.అంబేద్కర్ తెలిపారు. ఇప్పటివరకు 150 ఇళ్ల సర్వే పూర్తి చేశామన్నారు. సర్వే పూర్తయిన వెంటనే జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

రూ.24.06 లక్షల ఉపకార వేతనాల పంపిణీ

సబ్బవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న వెనుకబడిన తరగతుల విద్యార్థులకు సీఎస్ఆర్ నిధుల నుంచి 2024-25 విద్యా సంవత్సరానికిగాను 281 మందికి రూ.24.06 లక్షలు పంపిణీ చేసినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందుకు కృషి చేసిన హెచ్‌పీసీఎల్ ఈడీ రామనాథన్ రామకృష్ణ, సీనియర్ జీఎం జి.కిరణ్‌కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ కె.నాగేశ్, కన్సల్టెంట్ సీఎస్ఆర్ ఎం.కావలి, వీఎల్.నరసింహంకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

తుమ్మపాలలో వేసవి శిక్షణ శిబిరం


శిక్షణ శిబిరంలో చదువుతున్న విద్యార్థులు

తుమ్మపాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. విద్యార్థులకు పలు అంశాల్లో ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. కథలు, కథనాలు, సృజనాత్మక అంశాలను వివరించారు. అలాగే స్పోకెన్ ఇంగ్లీషును విద్యార్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులను ఉత్తేజపరిచేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సత్యకుమార్, నీలిమా, సత్యనారాయణ పాల్గొన్నారు.

మురికి కూపంలా మధురానగర్

తుమ్మపాల మేజర్ పంచాయతీ పరిధిలోని మధురానగర్ మురికి కూపంలా మారింది. ఏ మూలన చూసినా చెత్తాచెదారంతో దర్శనమిస్తోంది. రహదారులపైనే మురుగు ఏరులై పారుతుండడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

» ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలు
» రహదారులపైనే మురుగు నీరు తిష్ట
» భరించలేని దుర్వాసనతో ప్రజల ఇక్కట్లు
» ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు


మధురానగర్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలు

తుమ్మపాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మధురానగర్‌లో సుమారు 800 నుంచి వెయ్యి మంది జనాభా నివసిస్తున్నారు. పంచాయతీకి ఇంటి పన్నులు సైతం చెల్లిస్తున్నారు. పంచాయతీకి అత్యధికంగా ఇంటి పన్నులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం ఇక్కడ కనీస సదుపాయాల కల్పనలో విఫలమవుతున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మధురానగర్‌లోని ఏ మూల చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలతో నిండిపోతున్న చెత్తకుప్పలపై పందులు, వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ రోత పుట్టిస్తున్నాయి. వ్యర్థాల నుంచి భయంకరమైన దుర్వాసన వెదజల్లుతుండడంతో ఇళ్లల్లో ఉండేవారు అల్లాడిపోతున్నారు.


రహదారిపై పారుతున్న మురుగు నీరు


మధురానగర్‌లో చెత్త కుప్పలపై పందుల స్వైరవిహారం

వీధి రోడ్లపైనే మురుగు తిష్ట వేసి రోజుల తరబడి ఉండిపోతుండడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. మురుగు నిల్వలపై విషపూరితమైన దోమలు ప్రబలి స్థానికులపై దాడి చేస్తున్నాయి. రాత్రి వేళల్లో కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

దీనికితోడు విషపూరితమైన దోమల బారిన పడి పలువురు జ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇక వర్షాలు కురిసే సమయంలో వర్షపునీరు, మురుగునీరు ఏకమై ఇళ్లల్లోకి చేరిపోతుంది. ఈ మురుగులోంచే స్థానికులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి దాపురించింది. పారిశుధ్య నిర్వహణపై పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసి వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వారంలో కనీసం రెండు రోజులైనా పారిశుధ్య కార్మికులతో మధురానగర్‌ను పరిశుభ్రం చేయించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

ఇళ్లల్లోకి మురుగునీరు



-ఎం.లావణ్య, మధురానగర్

మధురానగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో కాలువల్లో మురుగు నిండిపోయి ఏకంగా ఇళ్లల్లోకి చేరిపోతోంది. వర్షాలు కురిసే సమయంలో ఇంటి పరిసరాలు మురుగుతో నిండిపోతున్నాయి. దీంతో ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి దాపురించింది. ఇంటిలో నిండిపోయిన మురుగును బయటకు తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నాం. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలి.

ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు



-దాడి జయశంకర్, మధురానగర్

మధురానగర్‌లో పారిశుధ్య సమస్య పరిష్కరించాలని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మా ప్రాంతంలో కొంత మంది కలిసి పారిశుధ్య కార్మికుల్లా మారి వీధులను శుభ్రం చేసుకుంటున్నాం. ఇప్పటికే పలుమార్లు పంచాయతీ కార్యాలయానికి వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు సమస్యను స్వయంగా విన్నవించినా కనీసం పట్టించుకోవడం లేదు. క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలి.

వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలి

వైద్యాధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించి పనితీరు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ పురోగతి, పనితీరు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే ప్రసవాలు, దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం వంటి వ్యాధులకు శస్త్ర చికిత్సలు జరిగేలా చూడాలని ఆదేశించారు. అలాగే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న, గర్భిణులను ముందుగా గుర్తించి, వారికి అవసరమైన వైద్య సేవలు అలందించాలన్నారు. వంద శాతం నాన్-కమ్యూనికేబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) సర్వే చేయాలని, వేసవి కాలం దృష్ట్యా ప్రజలు వడదెబ్బలు బారిన పడకుండా అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసి ప్రాథమిక చికిత్స నిమిత్తం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసి క్యాన్సర్ బారిన పడిన వారిని గుర్తించాలన్నారు. అనంతరం వారికి సరైన చికిత్స అందించాలని సూచించారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగేలా చూడాలని చెప్పారు. మలేరియా, డెంగ్యూ కేసులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొర్లివానిపాలెం రోడ్డు జంక్షన్

» మలుపులో తరుచూ ప్రమాదాలు
» పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


తరచూ ప్రమాదాలు జరుగుతున్న గొర్లివానిపాలెం జంక్షన్ మలుపు ఇదే...

సబ్బవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సబ్బవరం నుంచి చోడవరం వెళ్లే రహదారిలో గొర్లివానిపాలెం జంక్షన్ వద్ద మలుపు ప్రమాదకరంగా తయారైంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై పలుమార్లు సంబంధిత శాఖల అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకునే పాపానికి పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మంగళవారం జోడుగుళ్లకు చెందిన చిరు వ్యాపారి శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కొంత కాలంగా స్థానికులు అధికారులను కోరుతున్నారు. చోడవరం నుంచి వచ్చే వాహనాలు డౌన్ కారణంగా అతివేగంగా వచ్చి ప్రమాధాల బారిన పడుతున్నాయి. చోడవరం వైపు వెళ్లే వాహనాలు, సబ్బవరం వైపు వచ్చే వాహనాలు ఈ జంక్షన్ వద్ద తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు గాయాల పాలవుతుండగా, మరి కొందరు మృత్యువాత పడుతున్నారు. గతం కంటే ఇప్పుడు ఈ జంక్షన్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌లు ఏర్పడడంతో జనసంచారం పెరిగింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వంగలి, అంతకాపల్లి రోడ్డు కూడా ఇక్కడే చోడవరం రోడ్డును కలవడంతో ట్రాఫిక్ సమస్యతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు స్పందించి అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నూనె గింజల పంటలతో నాణ్యమైన దిగుబడులు

» వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రామారావు

కొత్తూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నూనె గింజల పంటలతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రామారావు చెప్పారు. అనకాపల్లి మండలంలోని వెంకుపాలెం గ్రామంలో మంగళవారం నూనె గింజల పంటలపై సామూహిక ప్రదర్శనలు చేశారు. బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నువ్వులతో శారద, ప్రొద్దు తిరుగుడు వంటి నూతన వంగడం ప్రభాత్, కలుపు మందులు, బోరాన్, పురుగు మందులు అందించి అధిక దిగుబడులకు పలు సూచనలు చేశారు. సుమారు 230 ఎకరాల్లో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. క్షేత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పంటకు నిర్దేశించిన యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ స్పష్టం చేశారు. అనంతరం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నూనె గింజల పంటల్లో సమగ్ర యాజామాన్య పద్ధతులైన విత్తన శుద్ధి, వరుసలలో విత్తుడం, కలుపు, ఎరువులు, చీడ పీడల యాజమాన్యం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి తులసిమణి, జిల్లా వనరుల కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికా వికాసానికి కృషి

» ఐసీడీఎస్ పీవో లలితకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో లలితకుమారి

సబ్బవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల వికాసానికి అంగన్‌వాడీలు కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లలితకుమారి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా ఉన్న పిల్లలను చేర్పించే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. వచ్చే నెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకూ సబ్బవరం, పరవాడ మండలాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సిహెచ్.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు పైడితల్లి, స్వర్ణ, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన తెలుగు యువత అధ్యక్షుడు రాజు


డిప్యూటీ స్పీకర్ రఘురామతో రాజు

సబ్బవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం వచ్చిన శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును ప్రభుత్వ అతిథి గృహంలో తెలుగు యువత అధ్యక్షుడు రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొరాడ శ్రీనివాసరావు ఉన్నారు.

దాడి వీరభద్రరావును కలిసిన కోట్ని బాలాజీ


కోట్ని బాలాజీకి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

కొత్తూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఎంఎస్ ఛైర్మన్‌గా నియామకమైన కోట్ని బాలాజీ మంగళవారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావును కలిశారు. అనకాపల్లి పట్టణంలోని లక్ష్మీనారాయణనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలాజీకి దాడి వీరభద్రరావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అప్పన్న నిజరూప దర్శనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలెం దిబ్బవీధిలోని వరహా లక్ష్మీనృసింహస్వామి నిజరూప దర్శనానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్వామి నిజరూప దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా వేసవి కావడంతో భక్తులకు ఎండ తగలకుండా ఉండేలా ఆలయం ముందు, వెనుక ఉన్న కొబ్బరి తోటలో షామియానాలను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారి నిజరూప దర్శనం భక్తులకు అందుబాటులో ఉంటుంది. అనంతరం గత వారం రోజులుగా అరగదీసిన చందనాన్ని అర్చకుల వేదమంత్రాల మధ్య స్వామివారికి పూసే కార్యక్రమం జరగనుంది.


గ్రంథాలయాలతో విజ్ఞానం

కశింకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయాలకు వెళ్లి తమ విజ్ఞానాన్ని పెంచుకోవాలని సీనియర్ సిటిజన్ భాస్కరరావు పిలుపునిచ్చారు. తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు గ్రంథాలయాలకు వెళ్లడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చిన్నప్పటి నుంచే విద్యార్థుల లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. గ్రంథాలయాలకు వెళ్లడం వల్ల విద్యార్థులకు క్రమశిక్షణ అలవాటవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జగన్ పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు భూమి పూజ

కశింకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెం గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటుకు గ్రామ సర్పంచ్ కొట్టె రాము మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి జలజీవన్ మిషన్ పథకం కింద రూ.37 లక్షలతో తాగునీరు అందించాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని చెప్పారు. గ్రామంలో ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేసి, వేసవిలో కూడా తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బల్లా అప్పలకొండ, నాయకులు సియాద్రి రాజు, పులిమంతుల గణేశ్, ఈగల భాస్కర్, బోని గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

తుంపాలమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో తుంపాలమ్మతల్లి

కశింకోట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చెర్ల గ్రామంలో తుంపాలమ్మతల్లి ఆలయం తొమ్మిదో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున నుంచి అమ్మవారిని పూజలు చేసి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

దుర్గమాంబకు ప్రత్యేక పూజలు

పరవాడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కన్నూరు పంచాయతీ పరిధిలోని మడకపాలెంలో దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆరు గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వార్షికోత్సవం జరిగింది.

రాయి క్వారీల్లో డీఎస్పీ తనిఖీలు

» గడువు ముగిసినా.. తవ్వకాలు జరుపుతున్నట్టు గుర్తింపు



వేటజంగాలపాలెంలో నల్లరాయి క్వారీని పరిశీలిస్తున్న డీఎస్పీ ఎం.శ్రావణి, పోలీసు, మైనింగ్, రెవెన్యూ అధికారులు

కొత్తూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను నిర్వహిస్తే చర్యలు తప్పవని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి హెచ్చరించారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు మంగళవారం ఆమె అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో నల్లరాయి క్వారీలను తనిఖీ చేశారు. ఒక క్వారీకి సంబంధించి అనుమతులను పరిశీలించగా అప్పటికే లైసెన్స్ గడువు ముగిసినట్టు గుర్తించారు. క్వారీలో రాయి లోడుతో వున్న లారీని సీజ్ చేశారు. క్వారీని సర్వే చేయించి అనుమతులు లేకుండా తవ్విన మేరకు జరిమానా విధిస్తామని ఆమె తెలిపారు. డీఎస్పీ వెంట అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్, మైన్స్ ఆర్ఐ బండారు శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

జనసేన శ్రేణుల్లో నిరాశ

» డీసీసీబీ చైర్మన్ పదవి పీవీఎస్ఎన్ రాజుకు దక్కుతుందని ఆశలు

» విశాఖ నేతకు కేటాయించడంతో అసంతృప్తి

చోడవరం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో గ్రామీణ జిల్లాలో కీలకమైన డీసీసీబీ పదవి కచ్చితంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజుకు దక్కుతుందని పార్టీ శ్రేణులు భావించారు. అయితే ఆ పదవిని విశాఖ నేతకు కట్టబెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇతర నియోజకవర్గాల నేతలతో పోలిస్తే ఒకింత చురుకుగా పార్టీ కార్యక్రమాలతో పాటు స్థానిక సమస్యలపైనా పీవీఎస్ఎన్ రాజు చురుకైన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ కేటాయించినట్టయితే ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. అయితే కూటమి పొత్తులో భాగంగా టీడీపీకే సీటు దక్కడంతో ఆ పార్టీ అభ్యర్థి విజయానికి కూడా సంపూర్ణంగా సహకరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నామినేటెడ్ పోస్టుల్లో తనకు ప్రాధాన్యత ఉంటుందని రాజు ధీమాగా ఉన్నారు. డీసీసీబీ చైర్మన్ పీఠం ఖాయంగా వస్తుందనిఇ ఆయన అనుయాయులు కూడా అంచనా వేసుకున్నారు. అయితే ఊహించని విధంగా డీసీసీబీ చైర్మన్ పదవిని విశాఖ నేతకు కేటాయించడంతో స్థానిక జనసేన నాయకులు నిరాశ చెందారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

కొత్తూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామానికి చెందిన ఎస్.కె.నమీనా అదృశ్యమైనట్టు భర్త పాలమూరి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇతను రోజూ మాదిరిగా ఈ నెల 20వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం ఆరు గంటలకు తిరిగి వచ్చాడు. ఇంటిలో భార్య కనిపించకపోవడంతో ఇరుగుపొరుగు వారిని, బంధువులను వాకబు చేశాడు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అనకాపల్లి పట్టణ ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.

మార్గదర్శులను గుర్తించండి

» కలెక్టర్ విజయకృష్ణన్



అధికారులతో సమావేశమైన కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో భాగంగా జిల్లాలో మార్గదర్శులను గుర్తించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన 'మార్గదర్శి-బంగారు కుటుంబం పీ4 జీరో పావర్టీ' కార్యక్రమంపై నియోజకవర్గం/ మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పీ 4 సర్వే ద్వారా జిల్లాలో 64,475 బంగారు కుటుంబాలను (ఆర్థికంగా అట్టడుగు వర్గాలు) గుర్తించామని, ఉన్నత స్థాయిలో ఉన్న 'మార్గదర్శు'లను ఎంచుకొని, బంగారు కుటుంబంతో అనుసంధానం చేయాలని చెప్పారు. సేవ గుణం ఉన్న ఉన్నతస్థాయి వ్యక్తులు 'జీరోపావర్టీ.ఏపీ.జీవోవి.ఐఎన్' అనే వెబ్‌సైట్‌లో మార్గదర్శిగా పేరు నమోదు చేసుకొని తమకు నచ్చిన బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీపీవో శిరీషారాణి, తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' చందనోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. చిత్రంలో 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణారావు, బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, సంస్థకు చెందిన పలు విభాగాల అధిపతులు ఉన్నారు

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' రూపొందించిన ప్రత్యేక సంచికను మంగళవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం క్షేత్రంతో పాటు అనుబంధంగా ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. త్వరలోనే కొండపై భక్తులకు కాటేజీలు అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. శ్రీకృష్ణాపురంలో సూర్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి త్రిదండి చినజీయరుస్వామి సూచనలు చేస్తామన్నారని, ఆ మేరకు పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణారావు, బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, బ్యూరో ఇన్‌ఛార్జి యర్రా శ్రీనివాసరావు, యాడ్స్ విభాగం మేనేజర్ చక్రవర్తి, సర్క్యులేషన్ విభాగం డిప్యూటీ మేనేజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ కంపెనీ రాష్ట్రానికి తలమానికం

» టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



బ్రాండిక్స్‌లో మహిళా ఉద్యోగులతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు. పక్కన సంస్థ భారతీయ భాగస్వామి దొరస్వామి

అచ్యుతాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పిస్తూ, పారిశ్రామిక, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఊతమిస్తున్న బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఆంధ్ర రాష్ట్రానికి తలమానికమని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. ఆయన మంగళవారం బ్రాండిక్స్‌ను సందర్శించిన మాట్లాడుతూ, ఒకేచోట ఇరవై వేల మంది మహిళలు ఉపాధిఇ పొందుతూ, తమ కుటుంబాల అభివృద్ధితోపాటు సమాజ ప్రగతిలో భాగస్వాములవడం ప్రశంసనీయమన్నారు. తగిన విద్యార్హత లేకపోయినప్పటికీ నిరుపేద మహిళలకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు, అనుగ్రహంతో సంస్థతో పాటు ఉద్యోగులు మరింత రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దుస్తుల తయారీ, ఎగుమతులు, ఉద్యోగులకు అందిస్తున్న సౌకర్యాలు, సేవా కార్యక్రమాలను సంస్థ భారతీయ భాగస్వామి దొరస్వామి ఆయనకు వివరించారు.

ప్రత్యేక తరగతుల పేరుతో చర్చిలో మత బోధనలు

» ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంపై పోలీసులకు ఫిర్యాదు

ఎలమంచిలి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరిట ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం.. ఓ చర్చిలో మత బోధనలు చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సాడి నాగ సత్య గణేశ్, మరికొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసులు ఫిర్యాదు చేశారు. మునిసిపాలిటీలోని పెదపల్లి స్కూలులో ప్రధానోపాధ్యాయుడిగా వీఎస్ఎం బాలు పనిచేస్తున్నాడు. పిల్లలకు వేసవి సెలవుల్లో ప్రత్యేకంగా పాఠాలు బోధిస్తానని, దీనివల్ల చదువులో ముందుంటారని తల్లిదండ్రులకు చెప్పాడు. దీంతో పలువురు అంగీకరించడంతో కొంతమంది పిల్లలను ఒక వ్యాన్‌లో ఎక్కించుకుని ఎలమంచిలిలోని ఒక చర్చికి తీసుకెళ్లి మత బోధనలు చేస్తున్నాడు. ఈ విషయం పిల్లల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు మంగళవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి సదరు హెచ్‌ఎంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు.

సింహగిరిపై ఉత్సవ శోభ

... 5వ పేజీ తరువాయి

గతంకంటే ఎక్కువగా నిర్మించారు. ఎక్కడికక్కడ తాగునీటి సదుపాయం కల్పించారు. అనేకచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. దివ్యాంగులను సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ దర్శనానికి అనుమతిస్తామని అధికారులు వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ మంగళవారం సింహగిరిపై పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్యూలు, బారికేడ్లు, మజ్జిగ, తాగునీటి పంపిణీ వంటి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సూచిక బోర్డులను ఎక్కువసంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కొండ దిగువన కొత్తఘాట్‌రోడ్డు, న్యూ గోశాల, పాత గోశాల రోడ్లలో ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, దేవదాయ శాఖ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. పార్కింగ్ ప్రాంతాలను, సైన్‌బోర్డులను చూడడంతో పాటు పోలీసు కంట్రోల్ రూమ్ వ్యవస్థపై కూడా పలు సూచనలిచ్చారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో చోరీ

... 5వ పేజీ తరువాయి

వెండి కవచం కనిపించలేదు. హుండీ సైతం పగులగొట్టి ఉంది. వెండి ఆభరణాలతోపాటు, హుండీలో నగదు చోరీ అయినట్టు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కృష్ణారావు, సిబ్బందితో ఆలయానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే అక్కడ వున్న ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. క్లూస్‌టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు. చోరీకి గురైన వెండి ఆభరణాలు విలువ సుమారు రూ.5.5 లక్షలు వుంటుందని ఆలయ కమిటీ సభ్యులు చెబుతున్నారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఆధార్ అప్‌డేట్‌కు పాట్లు

... 5వ పేజీ తరువాయి

కేంద్రాల కన్నా పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన కేంద్రానికి రద్దీ అధికంగా వుంటున్నది. దీనికితోడు గత రెండు రోజులు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్ప డడంతో ఆధార్ అప్‌డేట్ ఆలస్యంగా సాగింది. దీంతో కొంతమంది విసుగు చెంది ఇళ్లకు వెళ్లిపోయారు. మళ్లీ మంగళవారం ఉదయం ఆధార్ నమోదు కేంద్రాలకు వచ్చారు. దీంతో రద్దీ మరింత పెరిగింది. ఒక్కో వ్యక్తికి ఆధార్ అప్‌డేట్ లేదా మార్పులు/ చేర్పులు చేయడానికి 10-15 నిమిషాలు పడుతున్నది. దీంతో రోజు మొత్తం మీద 25-30 మందికి మాత్రమే ఆధార్ అప్‌డేట్ చేయగలుగుతున్నారు.

పుష్కర కాలంగా పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

కోటవురట్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మూడు కేసుల్లో నిందితుడిగా ఉండి 12 సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ జె.రమేశ్ తెలిపిన వివరాలు.. ఒడిశా రాష్ట్రం గుమ్మా ఏరియాకు చెందిన పాంగి అప్పారావు 2010లో కోటవురట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యా నేరంలో నిందితుడు. నర్సీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక అత్యాచారం కేసులో నిందితుడు. రిమాండ్‌లో ఉన్నపుడు 2013లో పోలీసుల కళ్లుగప్పి పారిపోయాడు. దీనిపై మరో కేసు నమోదైంది. అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి.రాజారావు, సిబ్బంది కలిసి నిందితుడు అప్పారావును మంగళవారం అరెస్టు చేశారు.

బైక్ చక్రానికి చున్నీ చుట్టుకుని మహిళ మృతి

అచ్యుతాపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భర్తతో బైక్‌పై వెళుతుండగా, ఒంటిపై వున్న చున్నీ చక్రంలో పడి గొంతుకు బిగుసుకుపోవడంతో ఓ మహిళ మృతిచెందింది. అచ్యుతాపురం మండలంహరిపాలెం వద్ద జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కేసనకుర్రుకి చెందిన విన్నకోట మోహనకృష్ణ, రామదుర్గ దంపతులు అచ్యుతాపురం బర్మాకాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. మోహనకృష్ణ అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు కర్మాగారంలో ఉద్యోగం చేస్తున్నాడు. రామదుర్గ చెవినొప్పితో బాధపడుతుండడంతో సోమవారం సాయంత్రం బైక్‌పై తిమ్మరాజుపేటలోని ఈఎస్ఐకి బయలుదేరారు. హరిపాలెం వద్దకు వచ్చే సరికి వెనుక కూర్చున్న రామదుర్గ చున్నీ బైక్ చక్రాలకు చుట్టుకుపోయి, ఆ వెంటనే గొంతుకు బిగుసుకుపోయింది. దీంతో వెంటనే బైక్ ఆపి స్థానికుల సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె చనిపోయినట్టు చెప్పారు. వీరికి తొమ్మిది నెలల క్రితం వివాహం అయ్యింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గణేశ్ చెప్పారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

... 5వ పేజీ తరువాయి

వెంటనే ఎలమంచిలి పోలీసులతో మాట్లాడారు. అనంతరం లోవరాజు తల్లి, భార్య, ఇతర కుటుంబ సభ్యులను మంగళవారం స్టేషన్‌కు పిలిపించి విచారించారు.

భార్య, ఆమె ప్రియుడు కలిసి హత్య?

ఎలమంచిలి పట్టణంలోని ధర్మవరానికి చెందిన తంగెళ్ల లోవరాజు(37)కు ఏలూరుకు చెందిన శ్యామలతో వివాహమైంది. వీరికి ఇద్దరు ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్యామలకు బావ వరుసైన మోహనకుమార్‌తో వివాహేతర సంబంధం ఉంది. దీనిని గుర్తించిన లోవరాజు ఇద్దరినీ హెచ్చరించాడు. ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్న లోవరాజు ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి విధులు ముగిసిన తరువాత వచ్చి నిద్రపోయాడు. తరువాత శ్యామల, మోహన్‌కుమార్ కలిసి లోవరాజును కత్తితో పొడిచి హత్యచేశారు. మోహనకుమార్ వద్ద పనిచేసే గంగాధర్ వీరికి సహకరించాడు. లోవరాజు మృతదేహాన్ని ఎర్ర రంగు కారులో వేసుకుని కాకినాడ జిల్లా చేబ్రోలు బైపాస్ రోడ్డులోకి తీసుకువచ్చి పడవేశారు. మరుసటి రోజు ఉదయం శ్యామల ఇల్లు కడుగుతుండగా.. తన కుమారుడి గురించి లోవరాజు తల్లి ఆరా తీసింది. ఇప్పుడే బయటకు వెళ్లాడని శ్యామల చెప్పింది. రక్తపు మరకలు కనిపించడంతో ఆమె ప్రశ్నించగా పిల్లి చనిపోయిందని శ్యామల కప్పిపుచ్చింది. అప్పటి నుంచి కుమారుడు ఇంటికి రాకపోవడం, కోడలి ప్రవర్తన అనుమానాస్పదంగా వుండడంతో లోవరాజు తల్లి సోమవారం సాయంత్రం ఎలమంచిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో గొల్లప్రోలు, ఎలమంచిలి పోలీసులు లోవరాజు భార్య శ్యామల, ఆమె ప్రియుడు మోహనరావులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తొలుత బుకాయించినప్పటికీ పోలీసులు అన్ని ఆధారాలను వారి ముందుంచడంతో నేరం చేసినట్టు ఒప్పుకున్నారు. గంగాధర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసును ఎలమంచిలి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేయనున్నారు.

క్రైం... crime news

ఆర్టీసీ బస్సు ఢీకొని చిరువ్యాపారి మృతి





సంఘటన స్థలంలో ఆర్టీసీ బస్సు. (ఇన్‌సెట్‌లో) సత్యవరపు శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

సబ్బవరం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో చిరువ్యాపారి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. స్థానిక జోడుగుళ్లకు చెందిన సత్యవరపు శ్రీనివాసరావు(57) చిరు వ్యాపారి. మామిడి పండ్లు కొనుగోలు చేసేందుకు మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై గొటివాడ సమీపంలో వున్న మామిడి తోటకు బయలుదేరాడు. గొర్లివానిపాలెం జంక్షన్ దాటిన తరువాత కుడివైపునకు మళ్లుతుండగా.. విశాఖ నుంచి చోడవరం వెళుతున్న సింహాచలం ఆర్టీసీ డిపోకు చెందిన మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొని ద్విచక్ర వాహనంతోపాటు శ్రీనివాసరావును కొంత దూరం ఈడ్చుకుపోయింది. దీంతో శ్రీనివాసరావు బస్సు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ దివ్య, సిబ్బందితో వెళ్లి బస్సును వెనక్కు తీయించి మృతదేహాన్ని బయటకు తీయించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శ్రీనివాసరావుకు భార్య పద్మావతి, కుమారులు సంతోశ్‌కుమార్, సాయికుమార్ ఉన్నారు. సంతోశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా కుటుంబమంతా కలిసి వచ్చే నెల నాలుగో తేదీన చార్‌ధామ్ యాత్ర కోసం టికెట్లు బుక్ చేసుకున్నామని, ఇంతలోనే దుర్ఘటన జరిగిందని వాపోయారు.

లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా

» రోడ్డు పక్కనున్న మేకల కాపరిపై పడడంతో అక్కడికక్కడే మృతి : ట్రాక్టర్‌లో ఉన్న ముగ్గురికి గాయాలు





బోల్తాపడిన ట్రాక్టర్ (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన సత్తిబాబు (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై స్థానిక వారపుసంత వద్ద జరిగిన ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో రోడ్డు పక్కన వున్న వ్యక్తి మృతి చెందాడు. ట్రాక్టర్‌లో వున్న ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకాకం.. నక్కపల్లి మండలం సీతంపాలెం గ్రామానికి చెందిన ప్రసాదుల భాస్కరరావు, మడక రమణ(శ్రీను), మేల నాగేంద్ర, చందక మహేశ్ మంగళవారం సాయంత్రం ట్రాక్టర్‌పై ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు వెళుతున్నారు. నక్కపల్లిలో వారపుసంత వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన మేకలు మేపుతున్న సారిపల్లివానిపాలెం గ్రామానికి చెందిన మామిడి సత్తిబాబు (38)పై పడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్‌లో వున్న భాస్కరరావు, రమణ, నాగేంద్ర గాయపడ్డారు. నక్కపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖ తరలించారు.

టీడీపీ కార్యకర్త కిడ్నాప్‌పై దర్యాప్తు

» నలుగురు వైసీపీ నాయకుల అరెస్టు

మాకవరపాలెం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2019లో సంచలనం రేపిన టీడీపీ కార్యకర్త కిడ్నాప్ కేసులో మంగళవారం నలుగురు వైసీపీ నాయకులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.వెంకటాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చొప్పా లత్సాబాబు 2019లో అప్పటి వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారనే కోపంతో వైసీపీ నాయకులు గాజువాకలో పనిచేస్తున్న అతనిని రెండు కారుల్లో వెళ్లి మాకవరపాలెం మండలం రాజుపేట గ్రామం వద్దకు తీసుకొని వచ్చి అక్కడ రోడ్డుకు దూరంగా ఉన్న మామిడి తోటల్లోకి తీసుకువెళ్లి తీవ్రంగా కొట్టారు. మోకాళ్లపై కూర్చోబెట్టి విమర్శలు చేసిన వైసీపీ నాయకులకు క్షమాపణ చెప్పించారు. అతను స్పృహ తప్పిపోవడంతో వైసీపీ నాయకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. అనంతరం అప్పటి టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి వదలివేశారు. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఈ ఘటనకు పాల్పడిన మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, చామంతిపురం సర్పంచ్ బొడ్డు గోవింద, రామన్నపాలెం సర్పంచ్ మాకిరెడ్డి అయ్యప్ప, సుభద్రయ్యపాలెం గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు గాంధీని మంగళవారం అరెస్టు చేశారు. మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారని, వారి కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయని ఎస్ఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439